VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : శుక్రవారం 26.06.2026
సంపుటి : 08 సంచిక : 17 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH www.velthuru.com



### రేవంత్ రియల్ ఎస్టేట్‌ను బొందపెట్టారు

- కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
- ఆరు గ్యారంటీలు గాలికొదిలేశారని విమర్శ

10

# ఉద్యోగులకు భద్రతే ప్రభుత్వ లక్ష్యం: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

- ప్రమాద బీమా అమలు
- బ్యాంకులతో ఒప్పందం
- ఉద్యోగులకు భరోసా
- సింగరేణి మోడల్ అమలు
- జీతాలు సకాలంలోనే
- గంట ఎక్కువ పనిచేయండి
- ఆదాయం పెంచుదాం
- అభివృద్ధే లక్ష్యం
- ట్రిలియన్ డాలర్ల తెలంగాణ
- ఉద్యోగులే ప్రభుత్వ బలం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 25:**

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించేందుకు బ్యాంకులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు విజయవంతంగా అమలు చేసిన రూ.1 కోటి ప్రమాద బీమా పథకాన్ని ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా విస్తరిస్తున్నామని తెలిపారు. ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు.ప్రభుత్వ ఉద్యోగుల భద్రత ప్రభుత్వ బాధ్యతేనని స్పష్టం చేసిన సీఎం, ప్రతి నెల మొదటి తేదీన జీతాలు చెల్లించడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను కూడా విడతల వారీగా విడుదల చేస్తున్నామని తెలిపారు.






# పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్లు

- జూన్ 28లోగా లొకేషన్ల ఖరారు
- జూలై మొదటి వారంలో బ్రోచర్ విడుదల
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 25:**

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ కల నెరవేర్చే క్రమంలో వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఉపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థ దెబ్బతినకుండా నియోజక వర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివశిస్తున్న ప్రాంతాలలోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గారు స్పష్టం చేశారు.



10

# భారత్‌లో విమానయాన విప్లవం

- ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- 'హబ్ అండ్ స్పోక్' మోడల్ ప్రారంభం..
- వారణాసి నుంచి తొలి విమానం
- ప్రపంచ అవకాశాలకు చిన్న నగరాల చేరువ
- మెట్రో విమానాశ్రయాలపై రద్దీ తగ్గింపు..
- మౌలిక వసతుల పూర్తి వినియోగం
- ఇమ్మిగ్రేషన్ సమస్యలకు శాశ్వత పరిష్కారం



2

- రానున్న రోజుల్లో ఆరు నగరాలకు విస్తరణ

**వారణాసి వెలుతురు జూన్ 25:**

భారతదేశాన్ని ప్రపంచ విమానయాన రంగానికి ప్రధాన కేంద్రంగా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం ఒక చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. దేశంలోని చిన్న నగరాలను సైతం అంతర్జాతీయ గమ్యస్థానాలతో నేరుగా అనుసంధానించే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'హబ్ అండ్ స్పోక్' విమానయాన నమూనా సేవలను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధికారికంగా ప్రారంభించారు. ఈ సరికొత్త విధానం కింద దేశంలోనే మొట్టమొదటి విమాన సేవలను ఉత్తరప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరమైన వారణాసి (కాశీ) నుంచి గురువారం నాడు జెండా ఊపి ప్రారంభించారు. రాబోయే ఆరు వారాల వ్యవధిలోనే ఈ వినూత్న సేవలను దేశంలోని మరో ఆరు ప్రధాన నగరాలకు వేగంగా విస్తరించనున్నట్లు మంత్రి ఈ సందర్భంగా సగర్వంగా ప్రకటించారు.ఈ చారిత్రాత్మక విమానయాన సేవల ప్రారంభోత్సవంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# మహాత్మా జ్యోతిరావు గురుకుల పాఠశాలలు ఇక నుండి తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహాత్మా జ్యోతిరావు పూలే విద్యా సంస్థల సొసైటీ గా మార్పు

- బీసీ గురుకులాల ద్వారా ఐఐటీ,ఐఐఐటీ ,ఎన్ఐటీ లకు ఎంపికైన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు
- ఎంజెపీ కి చెందిన వ్యవసాయ కళాశాలలో ఎంజేపి విద్యార్థులకు మాత్రమే అవకాశం
- బీసీ గురుకులాల బలోపేతానికి పలు సంస్కరణలకు ఆమోదం తెలుపుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఎంజేపీ



బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశంలో కీలక తీర్మానాలు

**హైదరాబాద్, వెలుతురు జూన్ 25:**

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారి అధ్యక్షతన సచివాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ (MJPTBCWREIS) 6వ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశం గురువారం నిర్వహించబడింది. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధి, పరిపాలనా బలోపేతానికి సంబంధించిన పలు కీలక అంశాలపై సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.సమావేశంలో పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ప్రాంతీయ సమన్వయ కార్యాలయాల (RCO) వివిధ విభాగాలకు బడ్జెట్ పరిమితులను బోర్డు ఆమోదించింది.

▶ మిగతా 10లో



2

# కన్నడ నాట అపూర్వ ఘట్టం

- ఒకే వేదికపై చేతులు కలిపిన ముగ్గురు ముఖ్యమంత్రులు
- కన్నుల పండుగగా తుంగభద్ర నూతన గేట్ల ప్రారంభోత్సవం
- సరికొత్త చరిత్ర సృష్టిస్తామంటూ డీకే శివకుమార్ ధీమా
- హోస్పేట్ ఐఆర్‌బీ గెస్ట్‌హౌస్‌లో కేంద్రమంత్రితో భేటీ
- వరుసగా నాలుగు ప్రధాన గేట్లను ప్రారంభించిన అగ్రనేతలు

# హైదరాబాద్ కార్నివాల్ ఏర్పాట్లపై మంత్రి జూపల్లి సమీక్ష

- నవంబర్ లేదా డిసెంబర్‌లో హైదరాబాద్ కార్నివాల్ నిర్వహణకు ప్రతిపాదనలు

**హైదరాబాద్, వెలుతురు జూన్ 25:**

పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో హైదరాబాద్ కార్నివాల్ నిర్వహణకు సంబంధించిన ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది నవంబర్ లేదా డిసెంబర్ నెలల్లో కార్నివాల్ నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

**షార్ట్‌లిస్ట్ అయిన సంస్థల ప్రజెంటేషన్లు**

హైదరాబాద్ కార్నివాల్ నిర్వహణ కోసం పర్యాటక శాఖ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థల నుంచి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ (ఆర్ఎఫ్‌పీ) ఆహ్వానించింది. అందిన ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం షార్ట్‌లిస్ట్ చేసిన సంస్థలు తమ కార్యాచరణ ప్రణాళికలు, కార్యక్రమ రూపకల్పన, సందర్శకుల ఆకర్షణ వ్యూహాలు, నిర్వహణ సామర్థ్యాలపై ప్రజెంటేషన్ ఇవ్వాలని సూచించారు.



## తుంగభద్ర జల సమస్యకు తొలి పరిష్కార అడుగు

- చరిత్రాత్మక రోజు: సీఎం
- రైతులకు శాశ్వత న్యాయం
- ఆర్‌డీఎస్‌కు నీళ్లు రావాలి
- మూడు రాష్ట్రాల సమన్వయం
- కేంద్రంపై ఆశాభావం
- రాజకీయాలకు అతీతంగా చర్చలు
- పంచాయితీ కాదు.. పరిష్కారం
- రైతులే ప్రాధాన్యం

10

# భారత్‌లో అమెజాన్ భారీ పెట్టుబడులు

- ప్రధాని మోదీతో సీఈఓ ఆండీ జాస్సీ భేటీ..
- రూ. 4.53 లక్షల కోట్లతో పెట్టుబడులు
- లక్షలాది ఉద్యోగాల సృష్టికి గ్రీన్ సిగ్నల్
- ఐదేళ్లలో 48 బిలియన్ డాలర్ల పెట్టుబడికి ముహూర్తం
- ఏఐ, క్లౌడ్ మౌలిక సదుపాయాల విస్తరణకు 13 బిలియన్ డాలర్లు
- దేశంలో 3.8 మిలియన్ల ఉద్యోగాలకు భారీ మద్దతు..



2

- ప్రభుత్వ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రయోజనాలు
- ప్రపంచవ్యాప్తంగా అగ్రగామిగా ఎదుగుతున్న భారత్..

# ఉద్యోగులకు భద్రతే ప్రభుత్వ...

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్న సీఎం, రోజుకు ఒక గంట అదనంగా పనిచేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి పని చేయాలని కోరారు. ప్రజల కోసం పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు బీమా రక్షణ కల్పించేందుకు MoU కార్యక్రమంనకు హాజరైన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేక్ వెంకట స్వామి, మహమ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉన్నతాధికారులు.

# హైదరాబాద్ కార్నివాల్ ఏర్పాట్లపై...

(మొదటి పేజీ తరువాయి)

### ప్రపంచ స్థాయి వార్షిక వేడుకగా తీర్చిదిద్దాలి

హైదరాబాద్ కార్నివాల్‌ను తెలంగాణ సంస్కృతి, వారసత్వం, కళలు, సంప్రదాయాలు, వంటకాలను ప్రపంచానికి చాటిచెప్పే అంతర్జాతీయ స్థాయి వార్షిక ఉత్సవంగా తీర్చిదిద్దాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వినూత్న కార్యక్రమాలు, సమర్థవంతమైన నిర్వహణ, భద్రతా, ట్రాఫిక్, ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పెద్ద ఎత్తున అంతర్జాతీయ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన అనుభవం ఉన్న సంస్థనే ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు.

### పర్యాటక శాఖ న్యాయ వ్యవహారాలపైనా సమీక్ష

పర్యాటక శాఖకు సంబంధించిన వివిధ న్యాయపరమైన కేసుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, శాఖ ప్రయోజనాలను పరిరక్షించేలా అవసరమైన న్యాయ చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, తదితర అధికారులు పాల్గొన్నారు.



# భారత్‌లో విమానయాన

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈ 'హబ్ అండ్ స్పోక్' విమానయాన నమూనా భారతదేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలను అంతర్జాతీయ వ్యాపార, పర్యాటక అవకాశాలకు మరింత చేరువ చేస్తుందని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. ఈ అధునాతన విధానం వల్ల ప్రయాణికులకు సుదీర్ఘ ప్రయాణ సమయం ఆదా అవ్వడమే కాకుండా, పెద్ద మెట్రో నగరాలతో సంబంధం లేకుండా చిన్న నగరాల ప్రజలకు సైతం ప్రపంచ స్థాయి విమాన అనుసంధానం అత్యంత సులభంగా లభిస్తుందని ప్రధాని మోదీ తన సందేశంలో కొనియాడారు.కొత్త విమానయాన నమూనా వల్ల దేశంలో ఇప్పటికే అందుబాటులో ఉన్న విమానయాన మౌలిక సదుపాయాలను మరింత సమర్థంగా, గరిష్ట సామర్థ్యంతో వినియోగించుకునే వీలుంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. విమానాల వినియోగ సామర్థ్యం గణనీయంగా పెరగడంతో పాటు, దిల్లీ, ముంబై లాంటి దేశంలోని ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయాలపై నిరంతరం ఉండే విమానాల రాకపోకల ఒత్తిడి, ప్రయాణికుల రద్దీ కూడా చాలా వరకు తగ్గుతుందని పేర్కొన్నారు. దేశ ఆర్థిక ప్రగతికి, విమానయాన రంగానికి ఈ విధానం కొత్త ఊపిరి పోస్తుందని ప్రధాని అభిప్రాయపడ్డారు.ఈ నూతన విమానయాన మోడల్ కింద దేశంలోనే మొట్టమొదటి సేవలను ప్రారంభించుకున్న వారణాసి నగరానికి ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక గుర్తింపు ఉందని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన జీవన నగరాలలో ఒకటైన కాశీ నగరం, భారతీయ సంస్కృతికి మరియు నాగరికతకు సమున్నత ప్రతీక అని పేర్కొన్నారు. దేశ వారసత్వాన్ని కాపాడుకుంటూనే, ఆధునిక సాంకేతిక అభివృద్ధితో ముందుకు సాగాలన్న కేంద్ర ప్రభుత్వ స్పష్టమైన దృక్పథానికి వారణాసి నగరం ఒక అద్దం పడుతుందని, ఈ మెరుగైన విమాన కనెక్టివిటీ ద్వారా ఈ నగరం తన సంప్రదాయాలను కాపాడుకుంటూనే ప్రపంచంతో బలమైన సంబంధాలను ఏర్పరుచుకుంటుందని చెప్పారు.కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు దేశీయ ప్రముఖ విమానయాన సంస్థ 'ఎయిర్ ఇండియా' ఈ ప్రత్యేక సేవల కోసం 'ఈజీ కనెక్ట్' అనే సరికొత్త విభాగాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ మోడల్ కింద తొలి విమానం 'ఏఐ 1111' గురువారం ఉదయం 9.30 గంటలకు వారణాసి విమానాశ్రయం నుంచి ప్రయాణికులతో దిల్లీకి బయలుదేరింది. ఈ విమానం ద్వారా దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ప్రయాణికులు.. అక్కడి నుంచి ఎలాంటి ఇబ్బంది లేకుండా దుబాయ్, కొలంబో, జెడ్డా, రియాద్, ఫుకెట్ వంటి ప్రపంచంలోని 9 ప్రధాన అంతర్జాతీయ నగరాలకు నేరుగా ప్రయాణించే అద్భుతమైన అవకాశాన్ని ఎయిర్ ఇండియా కల్పించింది.ఈ 'ఈజీ కనెక్ట్' మోడల్ ద్వారా విదేశాలకు వెళ్లే ప్రయాణికులకు కేంద్రం ఊహించని సదుపాయాన్ని కల్పించింది. ప్రయాణికులు తమ ప్రయాణాన్ని ప్రారంభించే మొదటి నగరంలోనే (ఉదాహరణకు వారణాసిలోనే) తమ బ్యాగేజీ (లగేజీ) చెక్-ఇన్ ప్రక్రియను, అంతర్జాతీయ ప్రయాణానికి అవసరమైన ఇమ్మిగ్రేషన్ తనిఖీలను పూర్తిగా పూర్తి చేసుకోవచ్చు. దీనివల్ల ప్రయాణికులు దిల్లీ లేదా ముంబై వంటి పెద్ద హబ్ విమానాశ్రయాలలో దిగిన తర్వాత మళ్లీ లగేజీ తీసుకోవడం, ఇమ్మిగ్రేషన్ క్యూలలో గంటల తరబడి నిలబడాల్సిన అవసరం ఉండదు.

ఈ విధానంతో ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా ప్రయాణికులకు ఎంతో హాయిగా, సౌకర్యవంతంగా ఉంటుంది.ఈ సరికొత్త 'ఈజీ కనెక్ట్' సేవలను రానున్న కొద్ది నెలల వ్యవధిలోనే దేశంలోని అన్ని ప్రధాన ప్రాంతాలకు విస్తరిస్తామని ఎయిర్ లైన్ సీఈఓ మరియు మేనేజింగ్ డైరెక్టర్ క్యాంప్ బెల్ విల్సన్ అధికారికంగా ప్రకటించారు. మొదటి విడత విజయవంతం కావడంతో త్వరలోనే అమృత్ సర్, అహ్మదాబాద్, కొచ్చి, గోవాతో పాటు దండకారణ్య, దక్షిణ భారత కేంద్రాలైన హైదరాబాద్, చెన్నై నగరాలకు కూడా ఈ సేవలను విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా మెట్రో నగరాల వెలుపల నివసించే కోట్ల మంది ప్రాంతీయ ప్రయాణికులకు అంతర్జాతీయ విమాన ప్రయాణాలు అత్యంత చౌకగా, సులభంగా మారనున్నాయి.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్లలో భారతదేశం మొదటి వరుసలో ఉందని పౌర విమానయాన నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దేశంలోని చిన్న చిన్న పట్టణాలను, గ్రామీణ ప్రాంతాలకు దగ్గరగా ఉండే నగరాలను అంతర్జాతీయ గమ్యస్థానాలతో అనుసంధానించడం ద్వారా దేశీయ ఆర్థిక రంగాన్ని బలోపేతం చేయాలని భావిస్తోంది. తద్వారా భారతదేశాన్ని కేవలం ఆసియా ఖండంలోనే కాకుండా, ప్రపంచంలోనే అతిపెద్ద విమానయాన రవాణా కేంద్రంగా (గ్లోబల్ ఏవియేషన్ హబ్) మార్చాలన్నది తమ మంత్రిత్వ శాఖ ప్రధాన లక్ష్యమని మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా ఈ నూతన విధానంపై మాట్లాడుతూ, 'హబ్ అండ్ స్పోక్' మోడల్ దేశంలోని రెండు, మూడో శ్రేణి నగరాల రూపురేఖలను మార్చబోతోందని హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ నగరాలతో ఈ చిన్న నగరాలకు నేరుగా అనుసంధానం ఏర్పడటం వల్ల విదేశీ పర్యాటకుల రాక పెరిగి పర్యాటక రంగం (టూరిజం) అభివృద్ధి చెందుతుందన్నారు. అంతేకాకుండా అంతర్జాతీయ సంస్థలు చిన్న నగరాల్లో కొత్త పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తాయని, తద్వారా స్థానిక యువతకు సాఫ్ట్‌వేర్, వాణిజ్యం, విద్య, వైద్య రంగాలలో లక్షలాది కొత్త ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# నైపుణ్యాభివృద్ధి & వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'కౌశల్ మహోత్సవ్ – వరంగల్ 2026' నిర్వహణ

- **తెలంగాణ యువతకు 5,000కు పైగా ఉద్యోగ అవకాశాలు**

**వరంగల్, వెలుతురు జూన్ 25, 2026:**

కేంద్ర నైపుణ్యాభివృద్ధి &వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ (MSDE) ఆధ్వర్యంలో 'కౌశల్ మహోత్సవ్ – వరంగల్ 2026' కార్యక్రమాన్ని ఈ నెల 27న తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ నగరంలో గల కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (KITS) ప్రాంగణంలో నిర్వహించారు.ఈ మేరకు కిట్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నైపుణ్యాభివృద్ధి& వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ డైరెక్టర్ శ్రీ వి.ఎస్. అరవింద్ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి & శిక్షణ శాఖ ప్రాంతీయ ఉపాధి అధికారి శ్రీ తౌటం రాము, కిట్స్ రిజిస్ట్రార్ శ్రీ కోమల్ రెడ్డి పాల్గొన్నారు.రానున్న కౌశల్ మహోత్సవ్‌లో వివిధ రంగాలకు చెందిన 50కు పైగా ప్రముఖ సంస్థలు పాల్గొననున్నాయి. తెలంగాణ యువత కోసం 5,000కు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంచనున్నాయి. నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులను పరిశ్రమలతో నేరుగా అనుసంధానించడం, అక్కడికక్కడే ఇంటర్వ్యూలు నిర్వహించడం, ఉపాధి మరియు అప్రెంటిస్‌షిప్ అవకాశాల ద్వారా స్థిరమైన జీవనోపాధి మార్గాలను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.ఈ మహోత్సవ్‌లో పాఠశాల విద్య పూర్తిచేసిన యువత, ఐటీఐ ఉత్తీర్ణులు, డిప్లొమా హోల్డర్లు, డిగ్రీ పట్టభద్రులు, నైపుణ్యాలు కలిగిన యువకులు పాల్గొనే అవకాశం ఉంటుంది. తయారీ, రిటైల్, లాజిస్టిక్స్, ఆటోమొబైల్, టెక్స్‌టైల్, ఐటీ–ఐటీఈఎస్, ఆరోగ్య సేవలు, పర్యాటకం మరియు ఆతిథ్య రంగం, టెలికాం, బ్యాంకింగ్–ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (BFSI) తదితర రంగాలకు చెందిన సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి.

ఈ సందర్భంగా శ్రీ వి.ఎస్. అరవింద్ మాట్లాడుతూ, "ప్రతి నైపుణ్యం కలిగిన యువకుడికి అర్థవంతమైన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలనే మా సంకల్పానికి కౌశల్ మహోత్సవ్ నిదర్శనం. ఒకే వేదికపై ఉద్యోగ దాతలు, ఉద్యోగార్థులను కలిపి నైపుణ్యాభివృద్ధి నుంచి ఉపాధి వరకు బలమైన అనుసంధానాన్ని సృష్టిస్తున్నాం. ఇది తెలంగాణ యువత ఆశయాలను సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది" అని తెలిపారు.




# కన్నడ నాట అపూర్వ ఘట్టం

(మొదటి పేజీ తరువాయి)

- **2024 వరదల ఉధృతికి కొట్టుకుపోయిన 19వ గేటు..**
- **నిపుణుల కమిటీ కీలక సిఫార్సులు**
- **రూ.51 కోట్ల భారీ వ్యయంతో రూపుదిద్దుకున్న 33 కొత్త గేట్లు**

**కర్ణాటక వెలుతురు జూన్ 25:**

దక్షిణ భారతదేశ రాజకీయ చరిత్రలో ఒక అద్భుతమైన, అరుదైన దృశ్యం కన్నడ నాట ఆవిష్కృతమైంది. భిన్నమైన రాజకీయ నేపథ్యాలు, సిద్ధాంతాలు కలిగిన ముగ్గురు దిగ్గజ ముఖ్యమంత్రులు ఒకే వేదికపైకి వచ్చి చేతులు కలిపారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజల సాగునీటి, తాగునీటి అవసరాలను తీర్చే జీవనది తుంగభద్ర సాక్షిగా ఈ అపూర్వ ఘట్టం చోటుచేసుకుంది. తుంగభద్ర జలాశయం నూతన క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఈ ముగ్గురు సీఎంలను ఒకే చోటుకు చేర్చింది. ఈ వేదికపై ముగ్గురు నేతలు ఎంతో ఆప్యాయంగా పలకరించుకుంటూ, పరస్పరం చేతులు పట్టుకుని సంఘీభావం ప్రకటించడం రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది.మూడు రాష్ట్రాల రైతులకు ఎంతో కీలకమైన తుంగభద్ర నదికి సంబంధించి ఒక పెద్ద సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ప్రస్తుత వర్షాకాలం ప్రారంభం కావడానికి ముందే తుంగభద్ర డ్యామ్‌కు సంబంధించిన అన్ని రకాల మరమ్మతు పనులను ఇంజినీరింగ్ అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. కర్ణాటకలోని హోస్పేట్ సమీపంలో ఉన్న తుంగభద్ర జలాశయానికి పాత గేట్ల స్థానంలో సరికొత్తగా 33 క్రస్ట్ గేట్లను అమర్చారు. ఈ నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కర్ణాటక ప్రభుత్వం అంగరంగ వైభవంగా నిర్వహించింది. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా



చంద్రబాబు నాయుడుతో పాటు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ప్రత్యేకంగా విచ్చేశారు.ఈ భారీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన ముగ్గురు ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రి మొదట హోస్పేట్ నగరంలోని ఐఆర్‌బీ ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడ ఒకరినొకరు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ ప్రత్యేక సమావేశంలో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ ముగ్గురు ముఖ్యమంత్రులతో కలిసి అంతర్రాష్ట్ర నదీ జలాల వినియోగం, తుంగభద్ర ప్రాజెక్టు భద్రత, రాబోయే వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రాథమికంగా చర్చించారు. మూడు రాష్ట్రాల మంత్రులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు కూడా ఈ సమన్వయ సమాచార మార్పిడి భేటీలో పాల్గొని తమతమ రాష్ట్రాల అభిప్రాయాలను పంచుకున్నారు.గెస్ట్‌హౌస్ సమావేశం ముగిసిన వెంటనే నేతలందరూ నేరుగా తుంగభద్ర డ్యామ్ పైభాగానికి చేరుకున్నారు. జలాశయం వద్ద కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో ముగ్గురు ముఖ్యమంత్రులు డీకే శివకుమార్, రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడులు కలిసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆ తర్వాత డ్యామ్‌కు సంబంధించిన అత్యంత కీలకమైన 17, 18, 19 మరియు 20వ నూతన క్రస్ట్ గేట్లను స్విచ్ నొక్కి అధికారికంగా ప్రారంభించారు. గేట్లు పైకి లేస్తూ జలధారలు కిందకు దూకుతున్న దృశ్యాన్ని చూసి నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు పునరుద్ధరణ విజయవంతంగా పూర్తయినందుకు గుర్తుగా అక్కడ ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక శిలాఫలకాన్ని కూడా వారు కలిసి ఆవిష్కరించారు.శిలాఫలకం ఆవిష్కరణ అనంతరం డ్యామ్ వద్ద ఒక అద్భుతమైన సంఘటన జరిగింది. కర్ణాటక సీఎం డీకే శివకుమార్ చొరవ తీసుకుని, ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరియు కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చేతులను ఒకరితో ఒకరు గట్టిగా కలిపారు. నలుగురు నేతలు ముక్తకంఠంతో చేతులు పైకెత్తి అక్కడ కూడిన వేలాది మంది ప్రజలకు, రైతులకు మరియు మీడియా ప్రతినిధులకు అభివాదం చేశారు. ఈ చారిత్రాత్మక గ్రూప్ ఫోటో ఇటు పత్రికల్లో, అటు సోషల్ మీడియా వేదికల్లో క్షణాల వ్యవధిలో వైరల్‌గా మారింది. దక్షిణ భారతావనిలో రాష్ట్రాల మధ్య ఉండే జల వివాదాలను పక్కనబెట్టి, రైతుల కోసం ముగ్గురు ముఖ్యమంత్రులు ఇలా కలిసి నిలబడటం నిజంగా గొప్ప విషయమని నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.ఈ ప్రాజెక్టు గేట్ల మార్పు వెనుక ఉన్న గతాన్ని పరిశీలిస్తే.. 2024 వానాకాలం సీజన్‌లో ఆగస్ట్ నెలలో తుంగభద్ర నదికి ఊహించని స్థాయిలో భారీగా వరద ప్రవాహం వచ్చింది. ఆ ఉధృతికి డ్యామ్‌కు ఉన్న పాత గేట్లలో ఒకటైన 19వ క్రస్ట్ గేటు గొలుసులు తెగిపోయి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో జలాశయం నుంచి లక్షలాది క్యూసెక్కుల నీరు వృథాగా కిందికి పోయింది. ఈ ప్రమాదంపై తీవ్రంగా స్పందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఒక ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేశాయి. డ్యామ్ భద్రతను పరిశీలించిన ఆ కమిటీ.. కేవలం ఒక గేటు మాత్రమే కాకుండా, డ్యామ్ కాలపరిమితిని దృష్టిలో ఉంచుకుని పాతబడిన అన్ని ప్రధాన గేట్లను మార్చాలని, వాటి స్థానంలో సరికొత్త గేట్లను అమర్చాలని ప్రభుత్వానికి కీలక సిఫార్సు చేసింది.నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కర్ణాటక ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన నిధులను మంజూరు చేసింది. దాదాపు రూ.51 కోట్ల భారీ వ్యయంతో మొత్తం 33 కొత్త క్రస్ట్ గేట్లను సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో అత్యాధునికంగా తయారు చేయించారు. ఈ గేట్ల తయారీ, బిగింపు పనులను నిరంతరం నిపుణుల పర్యవేక్షణలో రాత్రింబగళ్లు శ్రమించి పూర్తి చేశారు. ఎలాంటి వరద ఉధృతినైనా తట్టుకునేలా, ఎక్కువ కాలం మన్నేలా వీటిని డిజైన్ చేశారు. రాబోయే కాలంలో ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా సరికొత్త భద్రతా ప్రమాణాలతో ఈ డ్యామ్ ఇప్పుడు సర్వాంగ సుందరంగా సిద్ధమైంది.గేట్ల ప్రారంభోత్సవం విజయవంతంగా ముగిసిన అనంతరం కన్నడ ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ అత్యంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాము కేవలం ఈ గేట్ల ప్రారంభోత్సవానికే పరిమితం కాలేదని, పొరుగు రాష్ట్రాల మధ్య ఉన్న స్నేహసంబంధాలకు ఇది నిదర్శనమని చెప్పారు. "నేను, చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి.. మేం ముగ్గురం ముఖ్యమంత్రులం కలిసి రాబోయే రోజుల్లో సరికొత్త చరిత్ర సృష్టిస్తాం. నదీ జలాల పంపకాల్లో కానీ, అభివృద్ధి విషయాల్లో కానీ వివాదాలకు తావులేకుండా, కూర్చుని మాట్లాడుకుని మూడు రాష్ట్రాల ప్రజలకు, ముఖ్యంగా రైతాంగానికి అపారమైన మేలు చేస్తాం" అని డీకే శివకుమార్ గట్టిగా తేల్చి చెప్పారు. ఈ వ్యాఖ్యలతో తుంగభద్ర వేదికగా ముగిసిన ఈ కార్యక్రమం మూడు రాష్ట్రాల సత్సంబంధాలకు సరికొత్త బాటలు వేసింది.

# భారత్‌లో అమెజాన్ భారీ పెట్టుబడులు

- **క్లౌడ్, ఏఐ హబ్‌గా మారుతోందన్న ఆండీ జాస్సీ**
- **ప్రధాని మోదీ దార్శనికత అద్భుతమంటూ సీఈఓ ప్రశంసలు**
- **అమెజాన్ మెగా పెట్టుబడులపై మోదీ హర్షం**

**ఢిల్లీ వెలుతురు జూన్ 25:**

ప్రపంచ ఈ–కామర్స్ దిగ్గజం 'అమెజాన్' భారతదేశంలో తన వ్యాపార సామ్రాజ్యాన్ని ఊహించని స్థాయిలో విస్తరించేందుకు నడుం బిగించింది. రానున్న ఐదేళ్ల కాలంలో అంటే 2026 నుంచి 2030 మధ్య భారత మార్కెట్లో ఏకంగా 48 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 4.53 లక్షల కోట్లు) భారీ పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ గురువారం అధికారికంగా ప్రకటించింది. గతంలో ప్రకటించిన పెట్టుబడుల ప్రణాళికలను సవరిస్తూ.. భారతదేశ వృద్ధి రేటుపై నమ్మకంతో ఈ మొత్తాన్ని మరింతగా పెంచినట్లు కంపెనీ స్పష్టం చేసింది. ఒక విదేశీ సాంకేతిక సంస్థ భారత మార్కెట్లో ఇంతటి భారీ మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయనుండటం పారిశ్రామిక వర్గాల్లో సరికొత్త రికార్డుగా నిలిచింది.అమెజాన్ సంస్థ అంతర్జాతీయ ప్రధాన కార్యనిర్వాహక అధికారి (సీఈఓ) ఆండీ జాస్సీ భారత పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన భారత ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ అత్యున్నత స్థాయి భేటీలో భారత్‌లో డిజిటల్ విప్లవం, ఆర్థిక వృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలు మరియు అమెజాన్ భవిష్యత్తు ప్రణాళికలపై ఇరు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ప్రధాని మోదీతో జరిగిన ఈ సమావేశం ఎంతో ఫలప్రదంగా సాగిందని, ఆయనతో సమయం గడపడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆండీ జాస్సీ పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక సమావేశం ముగిసిన వెంటనే అమెజాన్ తన మెగా ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌ను ప్రపంచానికి వెల్లడించింది.అమెజాన్ ప్రకటించిన మొత్తం పెట్టుబడిలో సింహభాగం ఈ–కామర్స్ మార్కెట్‌ప్లేస్ రంగానికి చెందినదే అయినప్పటికీ, భవిష్యత్తు సాంకేతికతపై కంపెనీ ప్రత్యేక దృష్టి సారించింది. 2030 నాటికి భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను అంతర్జాతీయ స్థాయికి విస్తరించడానికి అదనంగా 13 బిలియన్ డాలర్ల పెట్టుబడిని కేటాయించినట్లు అమెజాన్ వెల్లడించింది. దీనితో కలిపి ఏఐ, క్లౌడ్ టెక్నాలజీ విభాగాల్లోనే అమెజాన్ మొత్తం పెట్టుబడి దాదాపు 21 బిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకోనుంది. దీని ద్వారా దేశంలోని డేటా సెంటర్ల సామర్థ్యం పెరగడమే కాకుండా వేగవంతమైన డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.భారతదేశంలో అమెజాన్ ప్రస్థానం ప్రారంభమై కేవలం ఒక దశాబ్దం మాత్రమే అవుతోందని, ఇది తమ సుదీర్ఘ ప్రయాణంలో ఒక చిన్న ఆరంభం మాత్రమేనని ఆండీ జాస్సీ అభిప్రాయపడ్డారు. 2010 నుంచి ఇప్పటివరకు భారత్‌లో 40 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టామని ఆయన గుర్తు చేశారు. తమ సరికొత్త పెట్టుబడుల ద్వారా 2030 నాటికి దేశంలో ఏకంగా 3.8 మిలియన్ల (38 లక్షల) మందికి ప్రత్యక్ష మరియు పరోక్ష ఉద్యోగ ఉపాధి అవకాశాలకు పూర్తి మద్దతు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. అలాగే 80 బిలియన్ డాలర్ల విలువైన మేడ్–ఇన్–ఇండియా ఉత్పత్తులను ఈ–కామర్స్ ప్లాట్‌ఫారమ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు.అమెజాన్ తన పెట్టుబడుల ద్వారా కేవలం వ్యాపార లాభాలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతను కూడా నెరవేర్చనుంది. దేశంలోని సుమారు 1.5 కోట్ల (15 మిలియన్ల) చిన్న, మధ్య తరహా వ్యాపారాలను (MSMEs) డిజిటలైజ్ చేసి, వాటిని అంతర్జాతీయ మార్కెట్‌కు అనుసంధానించనున్నారు. దీనితో పాటు సమాజంలోని పేద వర్గాలకు సాంకేతికతను చేరువ చేసేలా దాదాపు 40 లక్షల (4 మిలియన్ల) మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విద్యా ప్రయోజనాలను, కంప్యూటర్ సైన్స్ పరిజ్ఞానాన్ని ఉచితంగా అందించేలా సరికొత్త డిజిటల్ విద్యా ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు అమెజాన్ సీఈఓ వివరించారు.ప్రస్తుత తరుణంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తివంతమైన క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రంగా అవతరిస్తోందని అమెజాన్ సీఈఓ ఆండీ జాస్సీ కొనియాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో భారతీయ వినియోగదారులు, డెవలపర్లు, స్టార్టప్‌లు మరియు వ్యాపార సంస్థలు చూపిస్తున్న ఉత్సాహం ప్రపంచంలో మరెక్కడా లేదన్నారు. ఇండియాలో ఉన్న ఈ విపరీతమైన డిమాండ్, సాంకేతిక అనుకూల వాతావరణం కారణంగానే తాము క్లౌడ్ మరియు ఏఐ రంగాలపై మునుపెన్నడూ లేనంతగా నిధులు కుమ్మరిస్తున్నామని, రాబోయే రోజుల్లో ప్రపంచ సాంకేతిక దిశను భారత్ నిర్దేశిస్తుందని ఆయన జోస్యం చెప్పారు.భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరిపాలనా శైలి, ఆయనకున్న దార్శనికతపై అమెజాన్ అధినేత ఆండీ జాస్సీ ప్రశంసల జల్లు కురిపించారు. ప్రధాని మోదీని ఒక అద్భుతమైన 'విజనరీ లీడర్'గా ఆయన అభివర్ణించారు. భారతదేశాన్ని అన్ని రంగాలలో ప్రపంచ అగ్రగామిగా నిలబెట్టడానికి మోదీ దగ్గర ఎన్నో వినూత్నమైన ఆలోచనలు, స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయని కొనియాడారు. అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొంటూనే, దేశీయంగా ఐటీ మరియు డిజిటల్ మౌలిక సదుపాయాలను పెంచడంలో మోదీ విజన్ ఎంతో ఆకట్టుకునేలా ఉందని, ఆయన నాయకత్వంలో భారతదేశం అంతర్జాతీయ వేదికలపై అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని ఆండీ జాస్సీ కొనియాడారు.భారతదేశంలో అమెరికా ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ రికార్డు స్థాయిలో 48 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాలనే నిర్ణయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సాదరంగా స్వాగతించారు. అమెజాన్ సీఈఓ ఆండీ జాస్సీతో జరిగిన సమావేశంపై ప్రధాని హర్షం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక ప్రత్యేక పోస్ట్ పెట్టారు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి అంతర్జాతీయ సంస్థలకు పెరుగుతున్న ఆసక్తికి, భారత ఆర్థిక స్థిరత్వానికి ఈ పెట్టుబడే నిదర్శనమని మోదీ పేర్కొన్నారు. ఈ భారీ ఇన్వెస్ట్‌మెంట్లు దేశంలోని నిరుద్యోగ యువతకు సరికొత్త, ఉన్నత స్థాయి సాంకేతిక ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

# ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం... మన ఓటును రక్షించుకుందాం!

- **SIR ప్రక్రియ - ప్రజాస్వామ్యానికి రక్షణా? లేక ప్రజాస్వామ్యంపై ముప్పా?**
- **డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 25:**

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులను కల్పించింది. వాటిలో అత్యంత విలువైనది ఓటు హక్కు. ఈ హక్కు కేవలం ఎన్నికల్లో ఓటు వేయడానికి మాత్రమే కాదు; దేశ దిశను నిర్ణయించే శక్తి, ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు, రాజ్యాంగం మనకు ఇచ్చిన గొప్ప ఆయుధం. అందుకే ఒక పౌరుడి ఓటు హక్కును కాపాడటం ప్రతి ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి, రాజకీయ పార్టీలకు, ప్రతి భారతీయుడికి రాజ్యాంగబద్ధమైన బాధ్యత.ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న Special Intensive Revision (SIR) ప్రక్రియ ప్రజల్లో తీవ్రమైన చర్చకు దారితీసింది. ఎన్నికల సంఘం ప్రకారం ఈ ప్రక్రియ ఉద్దేశం ఓటరు జాబితాను పరిశుభ్రంగా ఉంచడం, మరణించినవారు, ఇతర ప్రాంతాలకు మారినవారు, డూప్లికేట్ నమోదులను తొలగించడం. ఈ లక్ష్యం సూత్రప్రాయంగా సమర్ధనీయమే. అయితే, ఈ ప్రక్రియ అమలులో పారదర్శకత, నిష్పాక్షికత, సహజ న్యాయం తప్పనిసరిగా ఉండాలి.కాంగ్రెస్ పార్టీతో పాటు పలు ప్రతిపక్ష పార్టీలు వ్యక్తం చేస్తున్న ఆందోళన ఏమిటంటే, SIR ప్రక్రియను బీజేపీ ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందనే అనుమానం. ముఖ్యంగా ప్రతిపక్షాలకు మద్దతుగా భావించే ప్రాంతాల్లోని పేదలు, మైనారిటీలు, దళితులు, ఆదివాసీలు, వలస కార్మికులు, బలహీన వర్గాల ఓటర్ల పేర్లు అధికంగా పరిశీలనకు గురవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమా కాదా అన్నది సంబంధిత సంస్థలు స్పష్టత ఇవ్వాల్సిన అంశమే అయినప్పటికీ, ఒక్క చెల్లుబాటు అయ్యే ఓటు కూడా అన్యాయంగా తొలగించబడకూడదన్న సూత్రంపై ఎలాంటి రాజీ ఉండకూడదు.ప్రజాస్వామ్యంలో అధికారాలు ప్రభుత్వాల చేతిలో ఉంటాయి. కానీ ప్రభుత్వాలను ఎన్నుకునే అధికారం ప్రజల చేతిలో ఉంటుంది. ఆ అధికారం ఓటు రూపంలో వ్యక్తమవుతుంది. ఒక నిజమైన ఓటరిని జాబితా నుంచి తొలగించడం అంటే అతని ఓటు హక్కును మాత్రమే కాదు, రాజ్యాంగం ఇచ్చిన సమానత్వ హక్కును కూడా దెబ్బతీయడమే.ఇక్కడ Booth Level Officers (BLOలు) మరియు Booth Level Agents (BLAలు) పాత్ర అత్యంత కీలకమైనది. BLOలు ఎన్నికల సంఘం తరఫున ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తారు, SIR ఫారాలను అందిస్తారు, కొత్త ఓటర్ల నమోదు, సవరణలు చేపడతారు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను పరిశీలిస్తారు. అదే విధంగా BLAలు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులుగా ఓటరు జాబితాను పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లు అన్యాయంగా తొలగించబడకుండా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లే బాధ్యతను నిర్వహిస్తారు.ఈ సందర్భంగా BLOలు, BLAలకు నా హృదయపూర్వక విజ్ఞప్తి. మీరు కేవలం ఒక విధిని నిర్వహించడం కాదు; భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడే రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లు, అధికార ప్రభావాలు, వ్యక్తిగత అభిరుచులు మీ విధి నిర్వహణపై ప్రభావం చూపకుండా, పూర్తిగా నిష్పాక్షికంగా, చట్టబద్ధంగా వ్యవహరించండి. ఒక్క అర్హుడైన ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించబడకుండా కాపాడండి.అలాగే ప్రతి పౌరుడికి నా విజ్ఞప్తి. మీ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో వెంటనే పరిశీలించండి. మీ కుటుంబ సభ్యుల పేర్లను కూడా ధృవీకరించండి. BLOలు ఇంటికి వచ్చినప్పుడు అవసరమైన సమాచారం, పత్రాలు సమర్పించండి. మీ పేరు లేకపోతే వెంటనే అభ్యంతరం నమోదు చేయండి. మీ గ్రామం, కాలనీ, వార్డు, బస్తీలో ప్రతి ఒక్కరికీ ఈ విషయంపై అవగాహన కల్పించండి. ప్రజాస్వామ్యం ఎన్నికల రోజు మాత్రమే కాపాడబడదు; ఎన్నికల జాబితా తయారయ్యే రోజునే కాపాడబడుతుంది.ఎన్నికల సంఘం కూడా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పూర్తిస్థాయి పారదర్శకతతో వ్యవహరించాలి. ప్రతి తొలగింపుకు చట్టబద్ధమైన కారణం ఉండాలి. ముందస్తు నోటీసు ఇవ్వాలి. అభ్యంతరాలు తెలిపే అవకాశం కల్పించాలి. మతం, కులం, భాష, ప్రాంతం లేదా రాజకీయ అభిప్రాయం ఆధారంగా ఒక్క ఓటరిపైనా వివక్ష జరగకుండా కఠినంగా పర్యవేక్షించాలి.

**ప్రజాస్వామ్యం బుల్లెట్‌తో కాదు... బ్యాలెట్‌తో నిలబడుతుంది.**

**ఒక్క ఓటు ప్రభుత్వాన్ని మార్చగలదు.**

**ఒక్క ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయించగలదు.**

**ఒక్క ఓటు రాజ్యాంగాన్ని రక్షించగలదు.**

అందుకే ప్రతి భారతీయుడు అప్రమత్తంగా ఉండాలి. మన ఓటును కాపాడుకోవడం అంటే మన రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే.

**"మీ ఓటు... మీ హక్కు... మీ భవిష్యత్తు... మీ బాధ్యత."**



ఓటును కాపాడుకుందాం... రాజ్యాంగాన్ని పరిరక్షిద్దాం... ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం.

# సంక్షేమమే ప్రజా ప్రభుత్వం అజెండా

- **ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపులు**
- **హాస్టల్ మరమ్మతులు నెలలో పూర్తి చేయాలి**
- **హాస్టళ్లు, స్టడీ సర్కిళ్లు, ఓవర్సీస్ విద్యానిధిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టి**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 25:**





సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా చెప్పారు. గురువారం నాడు బాబాసాహెబ్ అంబేద్కర్ సెక్రటేరియట్ లో బీసీ, ఎస్సీ, ఎస్టీ డిపార్ట్ మెంట్స్ సమీక్షా సమావేశం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో జరిగింది. ఈ ఈ సమావేశంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రైవేట్ భవనాల్లో వసతి పొందుతున్న విద్యార్థులను సాధ్యమైనంత మేరకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు మార్చే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలు హాస్టల్లో గురుకులాలలో మరమ్మతు పనులు ఒక నెలలోపు పూర్తి చేయాలని అధికారులను ఉపముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.7.5 కోట్ల మరమ్మతు బిల్లులను ప్రాధాన్యతతో క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచించారు. సంక్షేమ గురుకులాలు, హాస్టళ్ల రెంట్ ఛార్జీలు, డైట్, కాస్మోటిక్ ఛార్జీలకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ కు పంపాలని ఆయా శాఖ కార్యదర్శులకు ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు సంబంధించిన బిల్లులు ఏ కారణం చేతనైనా పంపక పోతే.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన అధికారులను హెచ్చరించారు. స్టడీ సర్కిళ్లను బలోపేతం చేసి, యూపీఎస్సీ, గ్రూప్ సర్వీసులు, ఇతర పోటీ పరీక్షల్లో విజయశాతాన్ని పెంచాలన్నారు. సంక్షేమ శాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వాటిని వెంటనే ఆర్థిక శాఖ క్లియరెన్స్ చేస్తుందని అన్నారు. అంబేద్కర్ టవర్, బాబూ జగ్జీవన్ రామ్ విద్యార్థి వసతి భవనాల నిర్మాణానికి సంభందించి నెలవారీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆయన అదేశించారు. బహుళ అంతస్తుల అంబేద్కర్ భవనంను 2027 ఏప్రిల్ 14న ప్రారంభోత్సవం నిర్వహించేలా లక్ష్యంగా పెట్టుకోవాలని అధికారులతో అన్నారు. అన్ని స్వయం ఉపాధి కార్యక్రమాలను రాజీవ్ యువ వికాసం కింద అమలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత ఈవీ ద్విచక్ర వాహన (స్కూటర్) పథకంకు సంభందించిన పూర్తి నివేదికను సమర్పించాలన్నారు. మెరుగైన ఆర్థిక ప్రణాళిక కోసం వార్షిక, త్రైమాసిక నిధుల అవసరాలను సమర్పించాలని తెలిపారు. అన్ని జిల్లాల్లో డా. బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ల స్థాపనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుంటూ బిల్లులను క్రమం తప్పకుండా సమర్పించి క్లియరెన్స్ పొందాలని ఆయా శాఖల కార్యదర్శులకు ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజాప్రభుత్వం వచ్చాక 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మొటిక్ చార్జీలు ఒకేసారి పెంచిందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. పెంచడమే కాకుండా ఆ బిల్లులు అన్ని ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామని ఆయన చెప్పారు. సంక్షేమ శాఖల ఆధ్వర్యంలోని అన్ని విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని అన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, 2014 నుంచి హైదరాబాద్ మినహా జిల్లాల నుంచి 1,810 మంది అభ్యర్థులు స్టడీ సర్కిళ్ల ద్వారా ఎంపిక కావడం విశేషం. కాగా.. వీరిలో దాదాపు 1,000 మంది ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎంపిక కావడం విశేషం. రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్వహణకు నెలకు రూ.29 కోట్ల నిధుల అవసరం ఉందని అధికారులు ఉప ముఖ్యమంత్రికి తెలిపారు. వివిధ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించిన పెండింగ్ చెల్లింపులు చేయాలని అధికారులు కోరారు.బ్ రూ.27 కోట్ల పెండింగ్ అద్దె చెల్లింపులను విడుదల చేయాలని కోరారు.ఈ సమీక్ష సమావేశంలో ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఉమెన్ చైల్డ్ డెవలప్మెంట్ కార్యదర్శి శ్రీమతి అనిత రామచంద్రన్, ఎస్సీ డెవలప్మెంట్ కార్యదర్శి విజయేంద్ర బొయి, శైలజ ఐఏఎస్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 27న భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం

- **ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి పనులు**
- **యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి**
- **అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 25:**

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా ఖ్యాతి గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు ఈ నెల 27వ తేదీన శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, భద్రాచలం ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆగమశాస్త్ర నియమాలను కచ్చితంగా పాటిస్తూ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.భద్రాచలం ఆలయ వైభవం, ఆధ్యాత్మికతకు ఎటువంటి భంగం కలగకుండా, సంప్రదాయ శిల్పకళను ప్రతిబింబించేలా రాతి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండు వందల సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ తరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సంకల్పించారని ఈ మేరకు ఈ నెల 27వ తేదీన ఆలయ పునరుద్ధరణ పనులను అధికారికంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోనే పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆలయ పునరుద్ధరణ పనులకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు 351 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వచ్చే శ్రీరామ నవమి నాటికి నిర్దేశించిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి ముందస్తుగానే పనుల విభజన చేసుకొని సమతరంగా అన్ని పనులు చేపట్టాలని సూచించారు.



# ప్రైవేట్ కాలేజీలకు హైకోర్టులో భారీ ఊరట

- **సంచలన జీవో 9పై తాత్కాలిక స్టే..**
- **ప్రభుత్వం, కాలేజీల మధ్య విద్యార్థుల ఇక్కట్లు**
- **సర్కార్ ఆంక్షలపై కోర్టు ఆగ్రహం**
- **యాజమాన్యాలకు ఊరటనిచ్చిన ధర్మాసనం**
- **సర్కార్‌పై కోర్టు ప్రశ్నల వర్షం**
- **వచ్చే మంగళవారానికి విచారణ వాయిదా**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 25:**

తెలంగాణ రాష్ట్రంలో ఫీజుల వసూళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చుట్టూ తిరుగుతున్న వివాదం ఇప్పుడు న్యాయస్థానానికి చేరింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వివాదాస్పద 'జీవో 9' ప్రైవేట్ విద్యాసంస్థల ఉనికిని దెబ్బతీసేలా ఉందంటూ పలు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాయి. ఈ జీవోలో పొందుపరిచిన కొన్ని కఠినమైన నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు ఉన్నత ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న న్యాయస్థానం, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు తాత్కాలికంగా ఊరట కలిగిస్తూ సదరు జీవోలోని కొన్ని వివాదాస్పద నిబంధనలపై అత్యవసర స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వం జారీ చేసిన జీవో 9 ప్రకారం.. ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయకూడదనే ప్రధాన ఆంక్షను విధించారు. దీనిపై యాజమాన్యాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో అందడం లేదని, కనీసం విద్యార్థుల నుంచి కూడా ఫీజులు తీసుకోనివ్వకపోతే తాము కాలేజీలను ఎలా నడపాలని ప్రశ్నించాయి. ఈ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు, విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలపై వచ్చే మంగళవారం వరకు మధ్యంతర స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ తాత్కాలిక ఆదేశాలు ప్రైవేట్ కాలేజీల నిర్వహణకు కొంత వెసులుబాటు కల్పించాయి.ప్రైవేట్ కళాశాలల పిటిషన్లపై జరిగిన విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వ లాయర్‌ను నిలదీస్తూ వరుస ప్రశ్నలు సంధించింది. "ప్రభుత్వం తరఫున ప్రైవేట్ కాలేజీలకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను మీరూ సకాలంలో చెల్లించరు.. అటువంటప్పుడు కనీసం కాలేజీల నిర్వహణ కోసం విద్యార్థుల నుంచి కూడా ఫీజులు వసూలు చేసుకోనివ్వరా? మరి కాలేజీలు ఎలా నడుస్తాయి? సిబ్బందికి జీతాలు ఎలా ఇస్తారు?" అని ధర్మాసనం నిలదీసింది. అసలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో ఎంత కేటాయించారు? పాత బకాయిలను ఎందుకు నిలిపివేశారు? వాటిని ఎప్పటిలోగా విడుదల చేస్తారో స్పష్టమైన సమాధానం చెప్పాలని ఆదేశించింది.హైకోర్టు ధర్మాసనం అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ కోర్టుకు వివరణ ఇచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సాంకేతిక మరియు పరిపాలనాపరమైన కొన్ని కారణాల వల్ల బకాయిల విడుదలలో కొంత ఆలస్యం జరిగిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాబోయే ఆగస్టు 15వ తేదీ లోపు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కళాశాలలకు చెల్లించాల్సిన అన్ని రకాల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను ప్రభుత్వం పూర్తిగా క్లియర్ చేస్తుందని, ఇందుకు సంబంధించిన నిధులను విడుదల చేయడానికి అవసరమైన ఏర్పాట్లు సాగుతున్నాయని ప్రభుత్వ లాయర్ న్యాయస్థానానికి అధికారికంగా విన్నవించారు.ప్రభుత్వ లాయర్ ఇచ్చిన హామీపై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల తరఫు న్యాయవాదులు కోర్టులో తమ వాదనను గట్టిగా వినిపించారు. గతంలోనూ ప్రభుత్వం ఇలాంటి హామీలు ఇచ్చి అమలు చేయలేదని గుర్తు చేశారు. అయితే, కోర్టు సమక్షంలో ప్రభుత్వం ఇచ్చిన తాజా గడువును తాము గౌరవిస్తామని చెప్పారు. ప్రభుత్వ లాయర్ చెప్పినట్లుగా ఆగస్టు 15వ తేదీ లోపు కాలేజీలకు రావాల్సిన వందలాది కోట్ల రూపాయల ఫీజు బకాయిలన్నీ పూర్తిగా యాజమాన్యాల ఖాతాల్లో జమ అయితే.. ఆ మరుసటి క్షణమే తాము కోర్టులో వేసిన అన్ని పిటిషన్లను వెనక్కి తీసుకుంటామని (విత్‌డ్రా చేసుకుంటామని) యాజమాన్యాలు స్పష్టం చేశాయి.ఈ ఫీజుల వివాదం కేవలం ప్రభుత్వం, ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాల మధ్యే కాకుండా విద్యార్థుల భవిష్యత్తును సైతం ప్రశ్నార్థకంగా మార్చింది. దీంతో ఈ కేసులో విద్యార్థులు కూడా తాము నష్టపోతున్నామంటూ హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. విద్యార్థుల తరఫు లాయర్ కోర్టులో వాదనలు వినిపిస్తూ.. "ఇక్కడ ప్రభుత్వం, కాలేజీల యాజమాన్యాల మధ్య జరుగుతున్న పోరాటంలో అమాయక విద్యార్థులు నలిగిపోతున్నారు. కాలేజీలు ఫీజులు కట్టమంటున్నాయి.. ప్రభుత్వం వద్దేమో జీవోలు ఉన్నాయి. ఈ బకాయిల గొడవల వల్ల విద్యా సంవత్సరం పాడవకుండా, విద్యార్థులు మానసికంగా నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత కోర్టుపై ఉంది" అని విజ్ఞప్తి చేశారు.ఫీజుల వసూళ్లకు సంబంధించిన ఆంక్షలు లేదా కోర్టు ఇచ్చే ఎలాంటి ఆదేశాలైనా ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా కాలేజీల్లో చేరిన విద్యార్థులకు మాత్రమే వర్తించేలా చూడాలని విద్యార్థుల తరఫు న్యాయవాది ధర్మాసనానికి ప్రత్యేకంగా విన్నవించారు. పాత విద్యార్థులకు ఇప్పటికే ఫీజుల విధానంపై ఒక స్పష్టత ఉందని, ఇప్పుడు కొత్తగా నిబంధనలు మారిస్తే అందరూ ఇబ్బంది పడతారని చెప్పారు. ప్రభుత్వం, యాజమాన్యాలు తమ పంతాలకు పోయి విద్యార్థుల విద్యా హక్కుకు భంగం కలిగించకుండా న్యాయస్థానమే తగిన దిశానిర్దేశం చేయాలని కోరారు.ఇరుపక్షాల సుదీర్ఘ వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం.. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు కాలేజీల నిర్వహణ కూడా ముఖ్యమేనని అభిప్రాయపడింది. అందుకే వివాదాస్పద జీవో 9పై తాత్కాలికంగా స్టే విధిస్తూ, కేసు తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. ఆ రోజున ప్రభుత్వం మరిన్ని వివరాలతో కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. హైకోర్టు తీసుకున్న ఈ తాత్కాలిక నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులలో రాబోయే మంగళవారం కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.



# నీ తలరాతను మార్చేది అవకాశం కాదు... నువ్వు తీసుకునే నిర్ణయమే!

మనిషి జీవితంలో అత్యంత శక్తివంతమైన, తిరుగులేని సత్యం ఏమిటంటే మన జీవిత గమనాన్ని నిర్ణయించేది మనకు వచ్చే అవకాశాలు కావు, ఆయా సమయాల్లో మనం తీసుకునే నిర్ణయాలు మాత్రమే. ప్రతి మనిషి ఉదయం నిద్ర లేచినప్పటి నుండి రాత్రి పడకపైకి చేరే వరకూ తన నిత్య జీవితంలో అసంఖ్యాకమైన చిన్న, పెద్ద నిర్ణయాలు తీసుకుంటాడు. ఈ రోజువారీ నిర్ణయాల మొత్తం సమాహారమే అతని భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుంది. నాకు సరైన అవకాశం రాలేదు, అందుకే నేను వెనుకబడిపోయాను అని నిరాశతో, నిస్పృహతో కాలం గడిపేవారికి చెప్పాల్సిన ఒకే ఒక్క హితవు అవకాశాల కోసం కేవలం వేచి ఉండేవారు అక్కడే ఆగిపోతారు, కానీ సొంతంగా నిర్ణయాలు తీసుకునేవారు మాత్రమే జీవితంలో ధైర్యంగా ముందడుగు వేస్తారు. బాధ్యత అనే పదం తెలుగు సంస్కృతిలో, సమాజంలో కేవలం ఒక నైతిక విలువ మాత్రమే కాదు అది ఒక ఉన్నతమైన జీవన తత్వం. మన పూర్వీకులు వేదోక్తంగా చెప్పారు.స్వ కర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః. దీని అంతరార్థం ఏమిటంటే, ప్రతి మనిషి తన స్వంత కర్మల ద్వారా, చేసే పనుల ద్వారా మాత్రమే సిద్ధిని లేదా విజయాన్ని పొందుతాడు. ఇక్కడ కర్మ అంటే కేవలం ఏదో ఒక పని చేయడం మాత్రమే కాదు అది పూర్తి స్పృహతో, విచక్షణతో తీసుకున్న ఒక నిర్ణయం, అలాగే ఆ నిర్ణయాన్ని చిత్తశుద్ధితో అమలు చేసే బాధ్యత కూడా.చరిత్ర పుటలను ఒకసారి తిరగేస్తే, అందులో నిలిచిన గొప్ప వ్యక్తులు కేవలం గొప్ప అవకాశాల వల్ల మాత్రమే ఉన్నత స్థానాలకు చేరలేదు, విపత్కర పరిస్థితుల్లో వారు తీసుకున్న అసాధారణ నిర్ణయాల వల్లే మహానుభావులయ్యారు. మహాత్మా గాంధీ గారు ఒక బారిష్టర్‌గా దక్షిణాఫ్రికా నుండి భారతదేశానికి తిరిగి వచ్చినప్పుడు, ఆయన అనుకుంటే ఎంతో విలాసవంతమైన, సౌకర్యవంతమైన వ్యక్తిగత జీవితాన్ని ఎంచుకుని ఉండవచ్చు. కానీ ఆనాటి నిర్ణయాత్మక క్షణంలో ఆయన తన స్వార్థాన్ని వీడి, నేను నా దేశ ప్రజల కోసం నిలబడతాను, పోరాడుతాను అని దృఢంగా నిర్ణయించుకున్నారు. ఆ ఒక్క చారిత్రాత్మక నిర్ణయమే యావత్ భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రను ఒక కొత్త మలుపు తిప్పింది. నిర్ణయాలకు అంతటి అపారమైన శక్తి ఉంటుంది వాటికి చరిత్ర గమనాన్ని సైతం మార్చే అద్భుత సామర్థ్యం ఉంది.అదేవిధంగా, మన వ్యక్తిగత రోజువారీ జీవితంలో కూడా మనం తీసుకునే చిన్న చిన్న నిర్ణయాలే కాలక్రమేణా పెద్ద ఫలితాలను ఇస్తాయి. ఉదయం ఒక గంట ముందుగా లేవాలని నిర్ణయించుకోవడం, ప్రతి రోజు కనీసం కొద్దిసేపైనా పుస్తకాలు చదువుకోవాలని నిశ్చయించుకోవడం, సమాజంలో తోటి ఇతరులకు సహాయపడాలని అనుకోవడం ఇవన్నీ పైకి మనకు చాలా చిన్నవిగా అనిపించినా, దీర్ఘకాలంలో ఇవే మన వ్యక్తిత్వాన్ని మలిచి, మన జీవితాన్ని ఉన్నతంగా నిర్మిస్తాయి. మనిషి అతను తీసుకున్న నిర్ణయాల సమాహారమే అనేది కేవలం పుస్తకాల్లోని తాత్విక వాక్యం కాదు అది అక్షరాలా జీవితపు ఆచరణాత్మక వాస్తవం.నేటి ఆధునిక యువతరం తరచూ బాధ్యత అంటే ఒక పెద్ద భారం, స్వేచ్ఛకు సంకెళ్ళు అని పొరపాటుగా భావిస్తోంది. కానీ నిజమైన మానవీయ అర్థంలో బాధ్యత అనేది ఒక భారం కాదు, అదొక గొప్ప వరం. ఎందుకంటే సమాజంలో బాధ్యత గలవారికే సరైన నిర్ణయం తీసుకునే సర్వ హక్కులు, స్వేచ్ఛ లభిస్తాయి. ఒక కుటుంబాన్ని క్రమశిక్షణతో నడిపించే తల్లిదండ్రులు, ఒక పెద్ద సంస్థను ప్రగతి పథంలో నడిపించే నాయకుడు, ఒక సమాజానికి ఆదర్శవంతమైన మార్గదర్శకత్వం చేసే మేధావి వీరందరూ బాధ్యత అనే వెలుగులోనే జీవిస్తున్నారు. ఆ అంతర్గత వెలుగే వారి జీవితాలను ఎంతో అర్థవంతంగా, గౌరవప్రదంగా మారుస్తుంది.మన సనాతన సంస్కృతిలో "ధర్మో రక్షతి రక్షితః" అని స్పష్టంగా చెప్పబడింది అంటే మనం ధర్మాన్ని రక్షిస్తే, ఆ ధర్మమే మనలను కాపాడుతుంది. ఇక్కడ ధర్మం అంటే మరేదో కాదు, నిబద్ధతతో, బాధ్యతగా జీవించడమే. దేశంలో ఒక్కో వ్యక్తి తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తే, ఒక్కో కుటుంబం ఆర్థికంగా, నైతికంగా నిలబడుతుంది; ఒక్కో కుటుంబం నిలబడితే, ఒక ఉత్తమ సమాజం బలపడుతుంది; సమాజం బలపడితే, యావత్ దేశం సగర్వంగా వికసిస్తుంది. ఈ బాధ్యత అనే మహా వృక్షం యొక్క విత్తనం మనం తీసుకునే ఒక్కో వివేకవంతమైన నిర్ణయమే.మనం తీసుకునే ప్రతి నిర్ణయం ఎల్లప్పుడూ సరైనదే అవ్వాలని ఏమీ లేదు. మానవ జీవితంలో కొన్నిసార్లు పొరపాట్లు జరగడం, తప్పు నిర్ణయాలు తీసుకోవడం పూర్తిగా అనివార్యం. కానీ ఆ తప్పు నిర్ణయాన్ని తీసుకున్నప్పుడు, ఇతరులను నిందించకుండా ఇది నా వల్లే జరిగింది, ఇది నా తప్పే అని నిజాయితీగా అంగీకరించే మానసిక సత్తా ఉండటమే నిజమైన బాధ్యత గల లక్షణం. చాలా మంది జీవితంలో వైఫల్యం ఎదురైనప్పుడు పరిస్థితులను, సమాజాన్ని, ఇతరులను లేదా తమ నొసటి రాతను నిందిస్తూ కూర్చుంటారు. కానీ బాధ్యతగల వ్యక్తి మాత్రం నేను వేరే మెరుగైన నిర్ణయం తీసుకోగలిగేవాడిని, ముమ్మందు తీసుకుంటాను అని తనను తాను సమీక్షించుకుంటాడు అది పరాజయం కాదు, అది నిజమైన అంతర్గత ఎదుగుదల.ప్రముఖ శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ దాదాపు వేయి వైఫల్యాల తర్వాతే విద్యుత్ బల్బును ప్రపంచానికి అందించారు. ఆయన ప్రతి వైఫల్యాన్ని నిరాశగా చూడకుండా, ఈ పద్ధతి ద్వారా విద్యుత్ బల్బు పనిచేయదని నేను కొత్తగా తెలుసుకున్నాను అని సానుకూలంగా చెప్పారు ఆ అద్భుతమైన వైఖరే ఆయన్ని ప్రపంచ మహానుభావునిగా నిలబెట్టింది. ఇది కేవలం ఒక శాస్త్రవేత్త కథ మాత్రమే కాదు ఇది నిర్ణయం మరియు బాధ్యత మధ్య ఉన్న అవినాభావ అనుబంధాన్ని చక్కగా వివరించే ఒక గొప్ప జీవిత సందేశం.ఒక వ్యక్తి తీసుకునే దృఢమైన నిర్ణయం సమాజంపై ఎంత లోతైన, దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందో చెప్పడానికి మనకు చరిత్రలో అనేక సజీవ ఉదాహరణలు ఉన్నాయి. జ్ఞానోదయ పథంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారు ఎన్ని కష్టాలు ఎదురైనా సరే ఉన్నత చదువులు చదువుకోవాలని, సమాజంలోని అసమానతలపై పోరాడాలని తీసుకున్న చారిత్రక నిర్ణయం భారతదేశంలోని కోట్లాది మంది దళిత, వెనుకబడిన సోదరుల జీవితాలను సానుకూల మలుపు తిప్పింది. విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ గారు తన సాహిత్యం, కళ ద్వారా విశ్వ మానవత్వాన్ని చాటిచెప్పాలని తీసుకున్న నిర్ణయం ఒక నూతన సాంస్కృతిక యుగాన్ని నిర్మించింది. ఈ గొప్పవారి నిర్ణయాలు కేవలం వారి వ్యక్తిగత ఎదుగుదలకు మాత్రమే పరిమితం కాలేదు అవి సమాజం మొత్తానికి ఒక దిక్సూచిగా మారాయి.నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాజంలో కూడా చాలా మంది యువకులు, చైతన్యవంతులైన మహిళలు, కష్టపడే వ్యవసాయదారులు తమ వినూత్న జీవిత నిర్ణయాల ద్వారా సమాజానికి కొత్త వెలుగులు చూపిస్తున్నారు. ఉదాహరణకు, ఒక సామాన్య రైతు రసాయనాలు విడిచి సేంద్రీయ వ్యవసాయానికి మళ్ళాలని ఒక గట్టి నిర్ణయం తీసుకుంటే, అది తన కుటుంబ ఆరోగ్యానికి మాత్రమే కాదు భూమి తల్లికి, భావి తరాల




మనుగడకు కూడా ఎంతో మేలు చేస్తుంది. ఒక ఆదర్శ ఉపాధ్యాయుడు క్లాస్ రూమ్‌లో విద్యార్థులకు కేవలం చదువే కాకుండా, నిజాయితీని, నైతిక విలువలను బోధించాలని నిర్ణయించుకుంటే, వందలాది మంది విద్యార్థుల జీవితాలు బంగారుమయంగా మారుతాయి. ఇది నిర్ణయాల వెనుక ఉన్న అసలైన శక్తి ఇది బాధ్యతల యొక్క మహోన్నత మహిమ. జీవితంలో ఒక మంచి నిర్ణయం తీసుకోవడానికి కేవలం ప్రాపంచిక తెలివితేటలు ఉంటే సరిపోదు దానికి గుండె నిండా అపారమైన ధైర్యం, ఆత్మశక్తి అవసరం. చాలా సార్లు మన నిత్య జీవితంలో ఏది సరైన నిర్ణయమో మన మనస్సాక్షికి స్పష్టంగా తెలిసినా, సమాజం ఏమనుకుంటుందో, పక్కవారు ఎలా స్పందిస్తారో అనే అనవసరమైన భయంతో తప్పుడు మార్గం వైపు వెళ్తాము. ఆ లోపలి భయాన్ని, జంకును పూర్తిగా జయించడమే నిజమైన బాధ్యత. ఎందుకంటే బాధ్యత అంటే ఇతరులు నన్ను అనుమతిస్తే లేదా ప్రోత్సహిస్తేనే నేను ఈ పని చేస్తాను అని కాదు ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా ఇది నైతికంగా సరైనది, కాబట్టి నేను దీనిని చేసి తీరుతాను అనే ధైర్యమే అసలైన బాధ్యతకు నిదర్శనం.మన తెలుగు నాట ఎంతో పవిత్రమైన తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో భక్తులు నిలబడినప్పుడు, కేవలం భౌతికమైన కోరికలు మాత్రమే కోరుకోరు తాము చేసిన తప్పులను భగవంతుని ఎదుట మనస్ఫూర్తిగా అంగీకరించి, భవిష్యత్తులో మెరుగైన, ధార్మికమైన నిర్ణయాలు తీసుకోవాలని గట్టిగా సంకల్పిస్తారు. ఆ పవిత్రమైన సంకల్పమే ఒక మంచి నిర్ణయం ఆ నిర్ణయమే వారి రాబోయే ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది. నిజమైన ఆధ్యాత్మికత అంటే కేవలం గుళ్ళూ గోపురాలు తిరుగుతూ భగవంతుని ప్రార్థించడం మాత్రమే కాదు అది మన లోపల నిద్రిస్తున్న బాధ్యతా స్వభావాన్ని, వివేకాన్ని మేల్కొల్పడం.నేటి ఆధునిక డిజిటల్ యుగంలో యువతకు అవకాశాలు అనంతంగా ఉన్నాయి చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఉచిత విద్య, స్టార్టప్ కల్చర్, ఎన్నో ప్రభుత్వ పథకాలు అన్నీ కూడా కేవలం ఒక క్లిక్ దూరంలో అందుబాటులో ఉన్నాయి. కానీ వాటిని సమాజానికి, మన వ్యక్తిగత ఎదుగుదలకు ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నాం అనేది పూర్తిగా మన చేతుల్లో ఉన్న నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుంది. ప్రతిరోజూ ఫోన్‌లో గంటల తరబడి సమయాన్ని వృథా చేస్తూ పనికిరాని వీడియోలు చూస్తూ కాలక్షేపం చేస్తారా లేదా అదే ఫోన్‌ను వాడుకుని భవిష్యత్తుకు ఉపయోగపడే ఒక కొత్త నైపుణ్యాన్ని, జ్ఞానాన్ని నేర్చుకుంటారా ఇది కేవలం అవకాశం గురించిన ప్రశ్న కాదు, ఇది స్పష్టమైన నిర్ణయానికి సంబంధించిన ప్రశ్న. ఇది వ్యక్తిగత బాధ్యతకు సంబంధించిన ప్రశ్న.నేటి యువతరానికి ఒక విషయం చాలా స్పష్టంగా, సూటిగా చెప్పాలి మీ జీవితం పూర్తిగా మీ చేతుల్లోనే ఉంది. కొన్నిసార్లు బాహ్య పరిస్థితులు మీకు అనుకూలంగా ఉండకపోవచ్చు, కుటుంబం లేదా సమాజం మిమ్మల్ని వెంటనే అర్థం చేసుకోకపోవచ్చు, కానీ మీ మనస్సులో మీరు తీసుకునే నిర్ణయాలు మాత్రం పూర్తిగా మీ సొంతం. ఆ నిర్ణయాలను పూర్తి బాధ్యతతో, వివేకంతో తీసుకున్న ప్రతిసారీ, మీరు మీ జీవితాన్ని కాస్తంత ఉన్నతంగా, ఆదర్శవంతంగా నిర్మించుకుంటున్నారు. అది మీ లోపల ఉన్న ఒక అద్భుతమైన సృజనాత్మక శక్తి — దాన్ని ముందుగా గుర్తించండి, జీవిత వికాసానికి వినియోగించండి.చివరగా ఒక్క మాట మన జీవితంలోకి అయాచితంగా అవకాశాలు రావడం లేదా రాకపోవడం అనేది ఎప్పుడూ మన చేతుల్లో లేకపోవచ్చు, కానీ ఆయా పరిస్థితుల నుండి సరికొత్త అవకాశాలను మనకు అనుకూలంగా సృష్టించుకోవడం తప్పకుండా మన చేతుల్లోనే ఉంది. ఆ సృష్టి అనేది కేవలం మనం తీసుకునే బాధ్యతగల, వివేకవంతమైన నిర్ణయాల ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. నేడు ఈ క్షణంలో మీరు మీ జీవితం గురించి ఏ నిర్ణయం తీసుకుంటున్నారు? ఆ నిర్ణయం రాబోయే రోజుల్లో ఏ దిశలో మీ జీవిత ప్రయాణాన్ని నడిపించబోతోంది? ఈ ప్రశ్నలకు మీ లోపల మీరు నిజాయితీగా సమాధానం వెతికే ఆ అమూల్యమైన క్షణమే, మీ జీవితంలో ఒక నూతన ఉజ్వల అధ్యాయానికి నాంది పలుకుతుంది.జీవితం అనేది కేవలం బాహ్య అవకాశాల కంటే, మనం అంతర్గతంగా తీసుకునే నిర్ణయాల ఫలితం అనే ఈ పరమ సత్యాన్ని మనసులో బలంగా నాటుకొని, జీవితంలో ప్రతి చిన్న నిర్ణయాన్ని బాధ్యతగా తీసుకున్నప్పుడు, మన జీవితం స్వయంగా ఒక అద్భుతమైన అవకాశంగా మారిపోతుంది. అదే మన ఉదాత్తమైన తెలుగు సంస్కృతి యొక్క అసలైన సారాంశం అదే మన పూర్వీకులు, మహానుభావులు మనకు అందించిన అత్యంత గొప్ప వారసత్వం.



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ అద్భుత ఘట్టం

- మూడు రాష్ట్రాల రైతాంగానికి చారిత్రాత్మక మైలురాయి
- వివాదాలు వీడి సహకరించుకుందామన్న సీఎం రేవంత్
- కరవు ప్రాంతాల భవిష్యత్తుకు కొత్త ఆశల పల్లకి
- రాయలసీమ, పాలమూరు నీటి కష్టాలు నాకు తెలుసు..
- రైతుల కోసం రాజకీయాలు పక్కన బెట్టాలి
- సకాలంలో పరిష్కారం కాని అంతర్రాష్ట్ర జల వివాదాలు..
- సముద్రం పాలు అవుతున్న విలువైన జలాలు
- తుంగభద్ర స్ఫూర్తితోనే కృష్ణా, గోదావరి నదీ జలాల పరిష్కారం
- తెలంగాణకు రావాల్సిన 10 టీఎంసీల వాటా దక్కాలి..
- ఆర్డీఎస్ రైతుల గోడును ప్రస్తావించిన సీఎం

**కర్ణాటక వెలుతురు జూన్ 25:**



దక్షిణ భారతదేశంలో అత్యంత కీలకమైన నీటి వనరుగా ఉన్న తుంగభద్ర జలాశయం సరికొత్త రూపు సంతరించుకుంది. కర్ణాటకలోని మునీరాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తుంగభద్ర డ్యామ్ క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ మరియు ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ చారిత్రాత్మక వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కొత్త గేట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుంగభద్ర జలాశయం నూతన క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ అనేది దక్షిణ భారత జలవనరుల చరిత్రలోనే ఒక చిరస్మరణీయమైన, ఎప్పటికీ గుర్తుండిపోయే అద్భుత ఘట్టంగా నిలుస్తుందని కొనియాడారు.ఈ ఆధునిక క్రస్ట్ గేట్ల నిర్మాణాన్ని కేవలం ఒక ఇంజినీరింగ్ అద్భుతంగా లేదా సాంకేతిక విజయంగా మాత్రమే చూసి వదిలేయలేమని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు ఆధునికీకరణ వెనుక మూడు రాష్ట్రాల పరిధిలోని లక్షలాది మంది రైతుల జీవనరేఖ దాగి ఉందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని ఎన్నో ఏళ్లుగా కరవుతో అల్లాడుతున్న జిల్లాలకు, అక్కడి వ్యవసాయ రంగానికి ఈ ప్రాజెక్టు పునరుద్ధరణ ఒక సరికొత్త మైలురాయిగా మారుతుందని చెప్పారు. ఎండిపోతున్న పొలాలకు ఈ నూతన గేట్లు మళ్లీ జీవం పోసి, రైతాంగ భవిష్యత్తుకు సరికొత్త ఆశల పల్లకిని మోస్తాయని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో కరవు ప్రాంతాల రైతుల ఇబ్బందులను సుదీర్ఘంగా ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాలైన కర్నూలు, అనంతపురం ప్రాంతాలతో పాటు తెలంగాణలోని పాలమూరు (మహబూబ్‌నగర్) జిల్లా ప్రజలు ఎదుర్కొన్న సాగునీటి, తాగునీటి కష్టాలు తనకు చాలా దగ్గరగా తెలుసన్నారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతాల ప్రజలు నీటి కోసం పడిన గోడును తాను కళ్లారా చూశానని గుర్తు చేసుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ ప్రయోజనాలను, ప్రాంతీయ వివాదాలను పూర్తిగా పక్కనబెట్టి, కేవలం అన్నదాతల శ్రేయస్సును మాత్రమే ముఖ్యాంశంగా తీసుకుని అన్ని ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని హితవు పలికారు.రాష్ట్రాల మధ్య తలెత్తుతున్న నీటి పంపకాల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి కొంత ఆవేదన వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రాల మధ్య వివిధ కారణాల వల్ల నదీ జలాల వివాదాలు సకాలంలో పరిష్కారం కాకపోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ పట్టింపుల వల్ల వర్షాకాలంలో వరదలు వచ్చినప్పుడు వాడుకోవాల్సిన విలువైన జలాలు ఏటా భారీగా వృథాగా సముద్రంలో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి కొరత ఉన్న దేశంలో ఒక్క చుక్క నీరు కూడా వృథా కాకుండా చూసుకోవాలని, అందుకు వివాదాలను వీడి సానుకూల దృక్పథంతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.ప్రస్తుతం తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ విషయంలో మూడు రాష్ట్రాలు చూపించిన చొరవ మరియు సమిష్టి స్ఫూర్తిని రేవంత్ రెడ్డి అభినందించారు. ఇదే అవగాహన, స్నేహపూర్వక వాతావరణాన్ని ముమ్మందు కూడా కొనసాగించాలని కోరారు. తుంగభద్ర వేదికగా ప్రారంభమైన ఈ సరికొత్త సమిష్టి స్ఫూర్తితోనే, రాబోయే రోజుల్లో తెలుగు రాష్ట్రాల మధ్య ఎంతో కాలంగా నలుగుతున్న కృష్ణా, గోదావరి నదీ జలాల పంపకాల సమస్యలకు కూడా శాశ్వత, పారదర్శక పరిష్కారాలు లభిస్తాయని తాను గట్టిగా ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఈ అంతర్రాష్ట్ర వేదికపైనే తెలంగాణకు సంబంధించిన ఒక అత్యంత కీలకమైన, న్యాయపరమైన జల వనరుల అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి ధైర్యంగా ప్రస్తావించారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి చట్టబద్ధంగా తెలంగాణ రాష్ట్రానికి దక్కాల్సిన 10 టీఎంసీల నీరు ఇప్పటికీ పూర్తి స్థాయిలో రావడం లేదని ఆయన గుర్తు చేశారు. దీనివల్ల రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీఎస్ పరిధిలోని మన రైతులకు న్యాయం జరగాలంటే తెలంగాణకు రావాల్సిన పూర్తి నీటి వాటాను సకాలంలో విడుదల చేయాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు.తెలంగాణ సరిహద్దు రైతుల హక్కులను కాపాడే విషయంలో పొరుగున ఉన్న కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పెద్దన్న పాత్ర పోషించాలని, ఎల్లప్పుడూ సహకార భావంతో వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నదీ జలాల వినియోగంలో ఏ ఒక్క రాష్ట్రం స్వార్థంతో ఆలోచించినా ప్రయోజనం ఉండదన్నారు. పొరుగు రాష్ట్రాలన్నీ పరస్పర నమ్మకం, అవగాహన, గౌరవంతో ముందుకు సాగితేనే కృష్ణా, తుంగభద్ర బేసిన్ పరిధిలోని మూడు రాష్ట్రాల రైతాంగానికి దీర్ఘకాలికంగా మేలు జరుగుతుందని, పంటలు సమృద్ధిగా పండుతాయని రేవంత్ రెడ్డి గట్టిగా చెప్పారు.ఈ పర్యటనలో భాగంగా మూడు రాష్ట్రాల ప్రతినిధులు, ఉన్నతాధికారుల మధ్య జరిగిన అంతర్గత చర్చలు అత్యంత సానుకూల వాతావరణంలో జరిగాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రైతుల సంక్షేమమే పరమావధిగా ఈ చర్చలు సాగాయన్నారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి జల వివాదాలు తలెత్తినా కోర్టుల చుట్టూ తిరగకుండా, ఇలాగే ఒకే వేదికపై కూర్చుని సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలనే సంకల్పాన్ని వ్యక్తంచేశారు. మొత్తానికి, సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ తుంగభద్ర నూతన క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం దక్షిణ భారతదేశంలో ఒక సరికొత్త జల విప్లవానికి, అంతర్రాష్ట్ర సత్సంబంధాలకు బాటలు వేసింది.

# నార్కెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత రక్త పరీక్ష కేంద్రం ప్రారంభం

**నార్కెట్‌పల్లి, వెలుతురు జూన్ 25:**

నార్కెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా సంఘ సభ్యుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత రక్త పరీక్ష కేంద్రాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వయస్సుతో సంబంధం లేకుండా అనేక రకాల వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. ఉచిత రక్త పరీక్షల ద్వారా ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మహిళా సంఘ సభ్యులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు.రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించిన ఆయన, ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి ఖర్చులు లేకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నందున ప్రజలు ముందుకు వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు.



# యాచారం మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్ పరిశీలన

- ప్రభుత్వ దవాఖానలు నిర్వీర్యం-తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టాలి
- సిపిఎం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ
- రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యదర్శి పగడాల యాదయ్య, యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూన్ 25:**

యాచారం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ ని సిపిఎం పార్టీ బృందం అకస్మాత్తుగా పరి శీలించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యద ర్శి జాన్ వెస్లీ గారు హాజరై వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో అన్ని గ్రామాలకు ప్రజలకు అం దుబాటులో ఉన్న ఆసుపత్రిలో అన్ని వసతులు అసౌకర్యంగా ఉన్నాయని అన్నారు 30 పడకల హాస్పిటల్ గతంలో మంచి సౌకర్యాలు ఉండి అన్ని రకాల వైద్యసౌకర్యాలు అందుబాటులో ఉండే వి కానీ క్రమక్రమంగా వైద్య సౌకర్యాలు తగ్గుతూ వస్తున్నాయని అన్నారు 2021 సంవత్సరం లో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హాస్పిటల్ అభివృద్ధి కోసం ఒక కోటి 50 లక్ష నిధులు మంజూ రు చేసిన నిధులు సక్రమంగా హాస్పిటల్ సౌకర్యాల కోసం నిధులు ఉపయోగించకుండా అధికారు లు పక్కదారి పట్టించారని నిధులు సరైన పద్ధతులు ఉపయోగించడంలోఅధికారులు పూర్తి నిర్ల క్ష్యం వహించారని అన్నారు తాత్కాలికంగా హాస్పిటల్ డెవలప్మెంట్ కోసం 50 లక్షలు రూపాయలు దుబారా ఖర్చులు చేశారని వెంటనే కలెక్టర్ గారు జో క్యం చేసుకొని 50 లక్షల డబ్బుకు సంబంధిం చిన విచారణ చేయాలని డిమాండ్ చేశారు నాసిరకమైన కలర్ వేయడం జరిగిందని అదేవిధంగా రోగులకు సంఖ్యకు అనుగుణంగా బెడ్లు లేవని అన్నారు వైద్యులు సరైన సమయానికి రాకుండా వారు ఇష్టం వచ్చినట్టు వచ్చి వెళ్తున్నారని రాత్రిపూట అసలు ఒక్క డాక్టర్ కూడా ఉండని పరిస్థితి ఉందని అన్నారు అదేవిధంగా 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలని ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ ఏఎన్ఎం ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని అన్నారు అదేవిధంగా శానిటైజర్ సిబ్బందికి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు అదేవిధం గా హాస్పటల్లో కనీసం త్రాగడానికి మంచినీరు సౌకర్యం లేదని అన్నారు అదేవిధంగా మూత్రశాల లు మరుగుదొడ్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వైద్య శాఖ మంత్రి ఈ హాస్పిటల్ ని సందర్శించి వెంటనే నిధులు కేటాయించాలని అన్నారు అదేవిధంగా అండర్ డ్రైనేజ్ సమస్య తోపాటు ఆసుపత్రి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని దానికి కావాల్సిన ని ధులు వెంటనే మంజూరు చేయాలని అన్నారు లేని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యా ప్తంగా ప్రభుత్వ వైద్య రంగంలో ఉన్నటువంటి సమస్యలపైన ఆందోళన చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య కార్యవర్గ సభ్యులు బోడ సామిల్ డి రామచందర్ డి జగదీష్ కందుకూరి జగన్ యాచారం మండల కార్యదర్శి ఆలంప ల్లి నరసింహ జిల్లా కమిటీ సభ్యులు పి అంజయ్య మండల కార్యవర్గ సభ్యులు అలంపల్లి జంగ య్య ఎస్ చందునాయక్ మండల కమిటీ సభ్యులు పి వెంకటయ్య ఉడుతల జంగయ్య మండల బాలరాజ్ కావాలి జగన్ డి పెద్దయ్య కేతావ నాయక్ విప్లవ కుమార్ పలు గ్రామాల పార్టీ శాఖ కార్య దర్శిలు పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఎల్ఏలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం

- హిమాయత్‌నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ సమావేశం
- బీఎల్ఏల బాధ్యతలను వివరించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- బూత్ నంబర్-07లో బీఎల్ఓ, బీఎల్ఏలతో కలిసి స్థానికులకు అవగాహన
- ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 25:**



ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలతో కీలక సమావేశం నిర్వహించారు.హైదరాబాద్ సిటీ కాంగ్రెస్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, హిమాయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ సమావేశంలో పాల్గొన్నారు. హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలోని 42 పోలింగ్ బూత్‌లకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లతో సమావేశమై, ఎస్ఐఆర్ ప్రక్రియలో వారు నిర్వర్తించాల్సిన బాధ్యతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనలు చేశారు.అనంతరం హిమాయత్‌నగర్ డివిజన్‌లోని బూత్ నంబర్-07ను సందర్శించిన నాయకులు, బీఎల్ఓ, బీఎల్ఏలతో కలిసి స్థానికులను కలిశారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను ప్రజలకు వివరిస్తూ, అవసరమైన సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 25:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 278వ డివిజన్ గాజుల రామారం పరిధిలోని శ్రీ రాం నగర్–బి, ఎమ్ ఎఫ్ ఫంక్షనల్ హాల్ ప్రాంతంలో సీసీ రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ సమస్యను కాలనీ వాసులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా, వారు వెంటనే స్పందించి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా రూ.55 లక్షలతో మొత్తం 8 సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయించి, వాటి శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, డీసీసీ సెక్రటరీ లాయక్, బోయిని వెంకటేష్, శ్రీధర్ వర్మ, సతీష్ బాబు, మాయిన్ భాయ్, కాలనీ అధ్యక్షులు మస్జీద్ భాయ్, హరీష్, ఆఫ్జాల్, శ్రీనివాస్ రావు, రహీమ్, ఖలీమ్, అజయ్, పాషా మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఇన్సూరెన్స్ స్కీం ప్రారంభోత్సవానికి హాజరైన టీఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఊటు యశ్వంత్, శ్రీనివాసరావు

**ఇబ్రహీం పట్నం వెలుతురు జూన్ 25:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు ఎటువంటి ప్రీమియం చె ల్లింపు ,విరాళం లేకుండా సహజ మరణం లేదా ప్రమాదవశాత్తు మరణం సంభవించినప్పుడు1.20 కోట్ల ఎంప్లాయిస్ లైఫ్ ఇ న్సూరెన్స్ స్కీము ప్రారంభోత్సవానికి హాజరైన రంగారెడ్డి జిల్లా టిఎన్జీవో నేతలు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బీమా పథకానికి సంబంధించి ప్రభుత్వం అన్ని బ్యాంకాలతో అవగాహన ఒప్పందంకు దుర్చుకుందని తెలిపారు ఈస్కీము అమలు చేయడం వలన తెలంగాణ రాష్ట్రంలో ఉన్నఉద్యోగు లకు పెన్షనర్లకు లబ్ధి చేకూరుతుందని వారు తెలిపారు ఈస్కీము అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వా నికి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ట్రేస్సా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు సు ధాకర ఎన్జీవో నేతలు సురేష్ అన్నపూర్ణ చేవెళ్ల డివిజన్ అధ్యక్షులు శివకుమార్ గాయత్రి వాణి ఆ మనగల్ యూనిట్ ప్రెసిడెంట్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ ఆస్పత్రులకు కీలక ఆదేశాలు

- క్యాన్సర్ పోర్టల్‌పై శిక్షణ
- వ్యాధుల నివేదికలు తప్పనిసరి
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 25:**



హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్స్, సికింద్రాబాద్ ఆడిటోరియంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ ఆస్పత్రుల మెడికల్ డైరెక్టర్లు, మేనేజింగ్ డైరెక్టర్లకు తెలంగాణ క్యాన్సర్ పోర్టల్, నోటిఫై చేయాల్సిన వ్యాధుల నివేదికలు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టంపై ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్ధారణ అయ్యే ప్రతి క్యాన్సర్ రోగి వివరాలను తెలంగాణ క్యాన్సర్ పోర్టల్‌లో నమోదు చేయడం తప్పనిసరి అని తెలిపారు. పోర్టల్ వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి పాల్గొన్న వారి సందేహాలను నివృత్తి చేసినట్లు చెప్పారు.అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్స్, డయాగ్నొస్టిక్ కేంద్రాలు నోటిఫై చేయాల్సిన వ్యాధుల నివేదికలను ప్రతినెల సంబంధిత ఆరోగ్య కేంద్రాలకు సమర్పించాలని సూచించారు. వ్యాధుల వ్యాప్తి అనుమానం వచ్చిన వెంటనే ఆరోగ్యశాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు.క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం, పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టంలోని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, అగ్నిమాపక భద్రత, రోగుల భద్రత ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారులు, ప్రోగ్రామ్ అధికారులు, జిల్లా మాస్ మీడియా అధికారి జక్కుల రాములు, వివిధ ప్రైవేట్ ఆస్పత్రులకు చెందిన సుమారు 150 మంది మెడికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



# విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి: బీసీ జేఏసీ

**హైదరాబాద్ వెలుతురు జూన్ 25:**



విద్యార్థులకు ఫీజులు చెల్లించండి అని హైకోర్టు తీర్పుచ్చిన రాష్ట్ర ప్రభుత్వం కనీసం మానవత్వం లేకుండా వ్యవహరించడం సరికాదువెంటనే విద్యార్థులకు రావాల్సిన బకాయిలు చెల్లించండి బడుగు బలహీన వర్గాల విద్యార్థులను ఆదుకోవాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేశారు.

# ప్రజా ఆరోగ్యం, సంక్షేమం కోసం పనిచేసే నాయకులు మన బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 25:**

గురువారం చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎల్వోసీ పత్రాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 126 – జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్పకు చెందిన కె.సుజాతమ్మ భర్త కె. మాధవ స్వామి, అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎల్వోసీ మంజూరు చేయించగా గురువారం రోజు జగద్గిరిగుట్ట డివిజన్ కు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు బాధిత లబ్దిదారులకు రూ. 1,10,000/– (లక్ష పదివేలు) రూపాయల విలువ గల ఎల్వోసీ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... పేద ప్రజల ఆరోగ్య భద్రత, సంక్షేమం కోసం అలోచించి అనునిత్యం పనిచేసే నాయకులు మన ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎల్పి విప్ కేపీ.వివేకానంద్ అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, బాబు గౌడ్, నర్సింహా రెడ్డి, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 30లోపు పీఆర్సీ ప్రకటించకపోతే ఉద్యమం తప్పదని యూటీఎఫ్ హెచ్చరిక

**వికారాబాద్,(వెలుతురు ప్రతినిధి) జూన్ 25:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 30లోపు పీఆర్సీ నివేదికను ప్రకటించి అమలు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ హెచ్చరించింది. గురువారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం ఈ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, బిల్లులను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు హామీని అమలు చేయాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం పేరుతో విద్యను ఉమ్మడి జాబితా నుంచి పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. విద్యా వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చే కుట్ర జరుగుతోందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల విలీన విధానాన్ని విరమించుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండేలా కొత్త పాఠశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్-సర్వీస్ టెట్ నుంచి ఉపాధ్యాయులకు పూర్తి మినహాయింపు కల్పించాలని కోరారు.

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రాములు మాట్లాడుతూ, ఆదాయపు పన్ను స్లాబ్‌లను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు.

# ప్రభుత్వ ఉద్యోగుల బీమా సౌకర్యానికి అవగాహన ఒప్పందం






- రవీంద్రభారతిలో ఎంఓయూపై సంతకాల కార్యక్రమం
- సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు
- ఉద్యోగుల సంక్షేమానికి బీమా సేవలు మరింత చేరువయ్యేలా చర్యలు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 25:**

ప్రభుత్వ ఉద్యోగులకు బీమా సౌకర్యాలు మరింత సమర్థవంతంగా అందించే లక్ష్యంతో రవీంద్రభారతిలో నిర్వహించిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాల కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు పాల్గొన్నారు.ప్రభుత్వ ఉద్యోగులకు బీమా సేవలను మరింత విస్తృతంగా, సులభంగా అందుబాటులోకి తీసుకురావడం, సంక్షేమ కార్యక్రమాలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ అవగాహన ఒప్పందం కుదిరినట్లు కార్యక్రమంలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగుల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని వెల్లడించారు.

## నూతన దంపతులకు ఆశీస్సులు అందించి పట్టువస్త్రాలు బహుకరించిన చిలువేరు సమ్మిగౌడ్

**కేసముద్రం వెలుతురు జూన్ 25:**



కేసముద్రం మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన గుద్దేటి బిక్షపతి నాలుగవ కుమార్తె వివాహ వేడుక పర్వతగిరి మండలం, అన్నారం (షరీఫ్ )గ్రామంలోని ఉమ్మగాని రవీందర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి బంధుమిత్రులు, గ్రామ పెద్దలు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ప్రత్యేక ఆహ్వానం మేరకు సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మిగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారికి పట్టువస్త్రాలను బహుకరించి, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.సమ్మిగౌడ్ గారి ఆత్మీయ ఆశీర్వాదాలు అందుకోవడం తమకు ఎంతో ఆనందంగా ఉందని వధూవరులు, గుద్దేటి బిక్షపతి కుటుంబ సభ్యులు తెలిపారు. వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన దంపతులను ఆశీర్వదించిన చిలువేరు సమ్మిగౌడ్ గారికి .గుద్దేటి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్యుత్ వైర్లు తాకి ఆవు మృతి

**మోత్కూర్, జూన్ 25,వెలుతురు న్యూస్ :**



మోత్కూర్ మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన రైతు ఎలుగు కోటిలింగం యొక్క రూ .90 వేల విలువైన ఆవు పాలడుగు శివారులోని పుల్సాని నర్సిరెడ్డి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్ద తీగలు కిందికి ఉండటంతో వాటికీ తాకి గురువారం వేకువజామున నాలుగు గంటలకు మృతి చెందింది. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఎత్తు లేకపోవడంతో ఆవు తాకి అక్కడికక్కడే మృతి చెందిందని రైతు కోటిలింగం తెలిపారు .విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిన తన ఆవుకు నష్టపరిహారం అందించాలని ఆయన విద్యుత్ అధికారులకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని మోత్కూరు విద్యుత్ శాఖ ఏఈకి స్థానిక పశువుల డాక్టర్ కు విన్నవించినట్లు రైతు పేర్కొన్నారు.

## మోత్కూర్ 12వ వార్డులో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం

- అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలి
- కౌన్సిలర్ మెంట రమణ నగేష్.

**మోత్కూర్, జూన్ 25,వెలుతురు న్యూస్ :**



మోత్కూర్ మున్సిపాలిటీలోని 12వ వార్డులో 4,5వ బూత్ పరిధిలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ మెంట రమణ–నాగేష్ ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఎలాంటి పొరపాట్లు లేకుండా తమ ఓటు వివరాలను నమోదు చేసుకోవాలని, ఓటరు జాబితాలో పేరు లేని వారు, వివరాల్లో మార్పులు లేదా సవరణలు అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షురాలు చాడ మంజుల, నాయకులు మహమ్మద్ షాకీరుద్దీన్, మందుల సురేష్, సంబంధిత బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), నాగరాజు ,సతీష్, పల్లపు సమ్మయ్య, బందెల రవి ,పోచం సోమయ్య, స్థానిక ఓటర్లు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ధర్మేందర్ రెడ్డి

**మోత్కూరు, జూన్ 25 వెలుతురు న్యూస్ :**



మండలంలోని అనాజీపురం గ్రామానికి చెందిన బి.ఆర్.ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చుక్క వెంకన్న కుమార్తె శిరీష_రాకేష్ వివాహం స్థానిక ఎల్ ఎన్ గార్డెన్ లో జరిగింది. వివాహానికి హాజరైన బారాస రాష్ట్ర నాయకులు నేవూరి ధర్మేందర్ రెడ్డి నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బారాస మండల అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్ నాథ్,, మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, మాజీ రైతుబంధు సమితి మండల అధ్యక్షులు కొండ సోమల్లు అంజయ్య తదితరులు ఉన్నారు.

## పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత

**మునుగోడు,జూన్ 25(వెలుతురు):**



తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి చేయూతనిస్తూ పులిపలుపుల గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి పగిళ్ల రాము రూ.10 వేల విలువైన క్రీడా సామగ్రిని స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలకు అందజేశారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా 6వ వార్డు సభ్యురాలు పగిళ్ల అనూష–రాము మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసానికి చదువుతో పాటు క్రీడలు కూడా కీలకమని అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు కళావతి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఆరోగ్యం, క్రమశిక్షణ, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. పూర్వ విద్యార్థులు తమ పాఠశాల పట్ల బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనగాం నరసింహ, సైదులు, స్వామి, సాయి, జనగాం స్వామి, సింగం స్వామి, పీఆర్‌టీయూటీఎస్ మండల శాఖ అధ్యక్షుడు యూసుఫ్ పాషా, ఉపాధ్యాయులు వెంకటయ్య, రవీందర్, నాగరాజు, రోహిణి, మేరీ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోగా పి. వెంకటేశ్వర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

**మునుగోడు,జూన్ 25(వెలుతురు):**



మునుగోడు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వెంకటేశ్వర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు.రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో మండల పంచాయతీ అధికారిగా పనిచేసిన పి. వెంకటేశ్వర్ రెడ్డి పదోన్నతి పొంది మునుగోడు మండలానికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇంచార్జ్ ఎంపీడీవో విధులు నిర్వహించిన విజయభాస్కర్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా అధికారులు,సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధి,ప్రజా సేవల మెరుగుదలకు కృషి చేస్తానని వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

# 20 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాలు

- చండూరులో లబ్ధిదారులకు పంపిణీ
- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం చేతుల మీదుగా అందజేత
- పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని వెల్లడి

**చండూరు వెలుతురు జూన్ 25:**



చండూరు మండలంలో తొలి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను వివిధ కారణాలతో నిర్మించుకోలేక పోయిన లబ్ధిదారుల స్థానంలో అదే గ్రామాలకు చెందిన అర్హులైన నిరుపేదలను ఎంపిక చేసి వారికి మంజూరి పత్రాలు అందజేశారు.చండూరు మార్కెట్ యార్డ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కలిసి చండూరు మండలంలోని ఎనిమిది గ్రామాలకు చెందిన 20 మంది కొత్త లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహాల మంజూరి పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇంటి కలను నిజం చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. మంజూరైన ఇళ్లను త్వరగా నిర్మించుకుని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# చండూరు కాంగ్రెస్‌కు కొత్త సారథులు

- మండల అధ్యక్షుడిగా ఐతరాజు మల్లేష్, పట్టణ అధ్యక్షుడిగా మేకల సాగర్ రెడ్డి నియామకం
- నియామక పత్రాలు అందజేసి అభినందించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపిన నూతన అధ్యక్షులు

**చండూరు వెలుతురు జూన్ 25:**



చండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఐతరాజు మల్లేష్, చండూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మేకల సాగర్ రెడ్డి నూతనంగా నియమితులయ్యారు. వారికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నియామక పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని నూతన మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శాలువాతో ఘనంగా సత్కరించారు. తమపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, కార్యకర్తలతో సమన్వయం చేసుకుని కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి పనిచేస్తామని వారు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని నూతన అధ్యక్షులకు సూచించారు. గ్రామ, మండల, పట్టణ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.నూతనంగా నియమితులైన మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులకు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువ కావాలని ఆకాంక్షించారు.

## ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ

**మునుగోడు,జూన్ 25 (వెలుతురు):**




ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారికి గురువారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని,అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పాఠశాల ఆవరణలోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు,డైరీలు విక్రయిస్తూ విద్యను వ్యాపారంగా మార్చుతున్నారని విమర్శించారు. అర్హతలు లేని ఉపాధ్యాయులతో బోధన నిర్వహించడం వల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వారితో పాటు ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గోపగోని ఉదయ్ తదితరులు ఉన్నారు.

## ఆదర్శంగా నిలిచిన బాచుప్పల సర్పంచ్

- పాఠశాల లో 3 నుండి18 కి పెరిగిన అడ్మిషన్స్

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 25:**



గ్రామం బాచుప్పల ప్రాథమిక పాఠశాలలో 3 ఉన్న అడ్మిషన్స్ గ్రామ సర్పంచ్ చొరవతో 15 కు పెరిగింది. ఆ ఊరి సర్పంచ్ బాచుప్పల మాధవి భూపాల్ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న తన 2 వ తరగతి అమ్మాయి ఉద్విత ను తమ ఊరి ప్రాథమిక పాఠశాలలో చేర్పించడమే కాకుండా పేరెంట్స్ తో కలిసి తమ పాఠశాలను కాపాడుకోవాలనే ఉద్దేశం తో తల్లిదండ్రులందరి చే తీర్మానం చేయించి గ్రామం లోని 15 మంది విద్యార్థులను చేర్పించి అందరికి ఆదర్శంగా నిలిచారు. వార్డు మెంబర్లు, మాజీ వార్డు మెంబర్లు కూడా తమ పిల్లలను చేర్పించారు. ఇప్పుడు బాచుప్పల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 18 కి చేరింది. ఇదే విధంగా ప్రతీ ఊరి ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను పరి రక్షించు కోవాలని సర్పంచ్ మాధవీ భూపాల్ కోరారు. ఈ సందర్భంగా తేదీ: 25/6/2026 గురువారం రోజు పాఠశాల లో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించడం జరిగింది . మరియు విద్యార్థులందరికీ పాఠశాల హెచ్ఎం ఓర్సు వెంకటయ్య నోటు బుక్స్ ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సందేనబోయిన మహేశ్వరి రవి, ఉపాధ్యాయులు శిరీష,, అన్గన్వాడి టీచర్ నాగమణి తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రాథమిక పాఠశాల బాచుపల్లి.

## పాల ఉత్పత్తిదారుల సహాయ సహకార సంఘం ఇంద్రపాలనగరం చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలం యాదవ్

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 25:**

నల్లగొండ –రంగారెడ్డి పాలఉత్పత్తి దారుల సహాయ సహకార సంఘము ఇంద్రపాలనగరం చైర్మన్ బి ఆర్ ఎస్ పార్టీ కైవసం నూతన చైర్మన్ గా ఎన్నికైన కంబాలపల్లి శ్రీశైలం యాదవ్ నూతన డైరెక్టర్లుగా ఎన్నికైన సింగనబోయిన శ్రీను, రాజన్నగారి అలివేలు వారి ఎన్నికకు సహకరించిన ఓటర్ మహాశయులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియచేశారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ డైరెక్టర్ లను సన్మానించి రైతుల అభివృద్ధికి తోడ్పాటు చేయాలని కోరిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ఎన్నికకు సహకరించిన డైరెక్టర్ లు గర్ధాస్ దామోదర్, కొలగాని పాండు, సింగణబోయిన అశోక్, పగుడాల రవిశంకర్, గొర్ల సత్యనారాయణ,గర్ధాస్ వెంకటేశం,11వ వార్డ్ మెంబెర్ వరికుప్పల స్వామి, మాజీ ఉపసర్పంచ్ గర్ధాస్ వెంకటేష్, ఎలక్షన్ ఆఫీసర్ తవుటం బిక్షపతికి ,మంటి అంజయ్య కి నూతనంగా ఎన్నికైన చైర్మన్, డైరెక్టర్లు ప్రత్యేక ధన్యవాదములు తెలియచేశారు.



## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 25:**

గురువారం రోజున రిజర్వేషన్ పేరుమీద గిరిజన ఓట్లను దండుకోవడం కోసం బస్సు యాత్ర పెట్టడం సిగ్గుచేటు అని ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈరోజు ఉదయం తన ఇంటి దగ్గర హౌస్ అరెస్ట్ చేయడం అమానుషమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీలకు రిజర్వేషన్ ఇచ్చినట్టుగా చెప్పాలి రాజ్యాంగబద్ధంగా రావలసినటువంటి రిజర్వేషన్ను కల్పించడం జరిగింది కానీ, కాంగ్రెస్ పార్టీ ఏదో లంబాడి జాతికి ఉద్ధరించినట్టుగా మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ప్రస్తుత ఎమ్మెల్సీగా ఉన్న శంకర్ నాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయ క్, మ హ బూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్,ఎంపీ బలరాం నాయక్ వారి నియోజకవర్గం ఏమీ అభివృద్ధి చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



అదేవిధంగా లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలి, సేవాలాల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి, ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలి అని డిమాండ్ చేశారు.

## డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రత కొనసాగించాలి

- ఆర్ఎస్పీ వీర అభిమాని నకిరేకంటి నరసింహ
- రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 25:



26 సంవత్సరాల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో ప్రాణాలకు తెగించి పోలీస్ శాఖలో పని చేసిన డాక్టర్ .ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బుల్లెట్ ప్రూఫ్ వాహనం భద్రతను కొనసాగించాలని ఆర్ ఎస్ పి వీరాభిమానం నకిరేకంటి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహోయిస్టులు వారి సానుభూతిపరుల నుండి ముప్పు ఉన్నదని ఆనాటి ప్రభుత్వాలు బుల్లెట్ ప్రూఫ్ కారును భద్రతను కొనసాగిస్తూ ఉంటే ఈనాటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసి అరాచకాలను అవినీతి అన్యాయాలను ప్రశ్నిస్తున్నాడని కక్షపూరితంగా బుల్లెట్ ప్రూఫ్ కార్ ను సిబ్బందిని తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హత్యకు రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజల తరఫున కొట్లాడేవారిని లక్ష్యంగా చేసుకొని విమర్శలకు సమాధానం చెప్పే ధైర్యం లేక ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ని కతం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయని తెలిపారు. ఆయన ప్రాణాలకు ఏమైనా అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే పూర్తి బాధ్యత వహించాలని రాష్ట్రవ్యాప్తంగా ఆర్.ఎస్.పి అభిమానుల నుండి పెద్ద ఎత్తున ఆందోళన ఉదృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## హత్యాయత్నం వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకోండి ...!



- **సీపీకి కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ ఫిర్యాదు**

**కరీంనగర్ వెలుతురు జూన్ 25:**

కరీంనగర్ నగరపాలక సంస్థ 29వ డివిజన్ కార్పొరేటర్, బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు సోమిడి వేణు ప్రసాద్ తనపై జరిగిన హత్యాయత్నంపై సమగ్ర విచారణ జరిపి, అసలు సూత్రధారులను కనిపెట్టి కఠినంగా శిక్షించాలని కోరుతూ కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ)కి గురువారం రోజున ఫిర్యాదు చేశారు. కిసాన్ నగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూములను అక్రమ కబ్జాదారుల నుండి కాపాడేందుకు తాను చేస్తున్న కృషి వల్లే, కబ్జాకోరులకు తాను టార్గెట్‌గా మారానని సోమిడివేణు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తుండటంతో, ఓర్వలేని వ్యక్తులు తనపై కక్ష పెంచుకున్నారని ఆయన ఆరోపించారు.ఈ హత్యాయత్నానికి సంబంధించి పోలీసులు ఇప్పటికే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నప్పటికీ, వారు తనకు పూర్తిగా అపరిచితులని, వారిపై ఎటువంటి వ్యక్తిగత కక్షలు లేవని కార్పొరేటర్ తెలిపారు. వారు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్ భర్త అయిన 'బాలరాజు' అనుచరులని తనకు సమాచారం ఉందని ఆయన స్పష్టం చేశారు. భూ కబ్జాల విషయంలో తాను చేస్తున్న పోరాటాన్ని అడ్డుకునేందుకు బాలరాజు తన అనుచరుల ద్వారా పక్కా ప్లాన్ ప్రకారం ఈ దాడి చేయించారని, దీనిపై లోతైన దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.తాజా సంఘటన నేపథ్యంలో తన ప్రాణాలకు తీవ్ర ముప్పు ఉందని, భవిష్యత్తులో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని వేణు ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధిగా ప్రజాసేవలో ఉన్న తనను కాపాడాలని, తనకు తక్షణమే పోలీసు భద్రత కల్పించాలని ఆయన సీపీని కోరారు. తెర వెనుక ఉండి కుట్రలు పన్నిన అసలైన దోషులను చట్టం ముందు నిలబెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ ఎస్ఐఆర్ పై దుష్ప్రచారం మానుకోవాలి

- **రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు నమోదు చేస్తున్న ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ పై రాష్ట్ర మంత్రి కె విశ్వాసం లేకపోతే ఎలా ?**
- **బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి**

**చొప్పదండి వెలుతురు జూన్ 25:**



చొప్పదండి నియోజకవర్గం లో నేడు బూత్ లెవల్ అధికారులు ఓటర్ల గృహాలు సందర్శించి వారికి ఎస్ఐఆర్ ఫారంలు అందిస్తూ అవగాహన కల్పించారు. చొప్పదండి మండలం రాగంపేట గ్రామంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రాగంపేట తాజా మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డి

తన కుటుంబ సభ్యుల యొక్క ఎస్ఐఆర్ ఫారం లు నింపి అధికారులకు తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఎస్ఐఆర్ వల్ల ఓట్లు పోతాయని ఇటీవల ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.ద్వితీయ శ్రేణి కాంగ్రెస్ నాయకులు ఎస్ ఐ ఆర్ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటూ ఉంటే కేవలం బంగ్లాదేశీ రోహింగ్యాల ఓట్లు కాపాడటం కోసం కోసం పొన్నం ప్రభాకర్ చౌకబారు విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మహారాష్ట్రలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకులు గవర్నర్ ను, మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి ఎస్ఐఆర్ మరింత పటిష్టంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారని చేశారు.కేరళలో డూప్లికేట్ ఓట్లు తగ్గిపోవడం వలన కాంగ్రెస్ పార్టీకి మేలు జరిగిందని శశి థరూర్ పేర్కొన్నారని సుప్రీంకోర్టు ఎస్ఐఆర్ ను సమర్థిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేసిన పిటిషన్లు కొట్టి వేసిన విషయాన్ని గుర్తు చేశారు.ఇప్పటివరకు దేశవ్యాప్తంగా జరిగిన ఏస్ ఐ ఆర్ లో ఏ ఒక్క అర్హుడైన ఓటర్ తన ఓటు కోల్పోయిన దాఖలా లేదని కేవలం మరణించిన వారివి, మరియు రెండు సార్లు నమోదు అయిన డూప్లికేట్ ఓట్లు మాత్రం తగ్గుతాయని ఈ సందర్భంగా ఆయన వివరించారు.అంతేకాక ఎస్ ఐ ఆర్ లో పాల్గొనే ఎన్నికల అధికారులు బిఎల్వోలు సూపర్వైజర్లు, మండల డివిజనల్ జిల్లా స్థాయి ఎన్నికల అధికారులు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులని, వీరు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పని చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులని మరి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు నమోదు చేసే ఓట్లపైన రాష్ట్ర మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారికే విశ్వాసం లేకపోవటం విడ్డూరమని సింగిరెడ్డి కృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో చొప్పదండి బిజెపి అసెంబ్లీ కన్వీనర్ శ్రీ పెరుక శ్రావణ్ కుమార్, గుండె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## SIR కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మండల అధ్యక్షుడు మహమ్మద్ మాక్సూద్ అహ్మద్

- **ప్రతి కుటుంబం ఓటు వివరాలు పరిశీలించుకోవాలి...**
- **ఓటు హక్కును కాపాడుకోవాలని పిలుపు....**

**జహీరాబాద్ వెలుతురు, జూన్ 25:**



ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మాజీ మండల అధ్యక్షులు మహమ్మద్ మాక్సూద్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్నారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటరు వివరాలను పరిశీలించుకుని, అవసరమైతే సవరణలు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.అలాగే, ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొని తమ ఓటును భద్రపరచుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కును పరిరక్షించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. "మీ ఓటు – మీ హక్కు, మీ భవిష్యత్తు. ప్రతి ఒక్కరూ SIR కార్యక్రమంలో పాల్గొని తమ ఓటును సురక్షితంగా ఉంచుకోండి" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, బీఎల్‌వోలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల అభ్యున్నతికి రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఇందిరా గాంధీదే

- **రిజర్వేషన్లతోనే గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండాయి...**
- **ఎఐబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్....**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 25:**





గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పెద్దపీట వేసిందని, గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి వారి అభ్యున్నతికి బాటలు వేసిన ఘనత దివంగత ప్రధానమంత్రి ఇందిరా గాంధీదేనని ఎఐబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇందిరా గాంధీ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొహమ్మద్ యూనుస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములు యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పవన్ రాథోడ్, నాయకులు నరేష్ గౌడ్, సర్పంచులు ప్రేమ్‌సింగ్, చందర్ చౌహన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కిషన్ రావు పవార్, మాజీ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు పాల్గొన్నారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇందిరా గాంధీ చొరవ వల్లే గిరిజనులకు రిజర్వేషన్లు లభించి నేడు వారు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు.

ఆమె ఆశయసాధన దిశగా ముందుకు సాగాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా గిరిజన సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గాల పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమానికి నియోజకవర్గంలోని గిరిజనులు పెద్ద ఎత్తున తరలివెళ్లనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చవాన్ రవీందర్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాథోడ్ ధర్ము, జహీరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బానోత్, ఉప సర్పంచ్ శివ రాథోడ్, శంకర్ నాయక్, సుభాష్ సర్పంచ్, రమేష్ ఉప సర్పంచ్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం అందజేసిన హుగ్గేల్లీ సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి

- **ఎన్నికల హామీని నిలబెట్టుకుంటూ పెళ్లి కానుకగా నగదు సహాయం....**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 25:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హుగ్గేల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్ రెడ్డి సామాజిక బాధ్యతతో మరోసారి ముందుకు వచ్చారు. ఎన్నికల సమయంలో గ్రామంలోని ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు గురువారం శ్రీమతి సునీత–జైరాజ్ దంపతుల కుమార్తె దీపిక వివాహ నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి పెళ్లి కానుకగా ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని ఆడబిడ్డల వివాహాలకు తన వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని, గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.తమ కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయం అందించిన సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డికి వధువు కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, సీనియర్ నాయకులు నర్సింహులు, బాల్‌రాజ్, రాజశేఖర్, సిద్దారెడ్డి, మశ్చేందర్, రాములు, ఏసప్ప, ప్రేమ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణకు ముందుకు రావాలి

- **స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)లో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలని పిలుపు...**
- **జహీరాబాద్-2 బీజేపీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి బసంత్‌పూర్...**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 25:**



ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – SIR) కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్–2 బీజేపీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి బసంత్‌పూర్ పిలుపునిచ్చారు.ఈ మేరకు ఆయన విడుదల చేసిన అవగాహన పోస్టర్‌లో జనవరి 25 వరకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు.

అలాగే ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారు తమ వివరాలను మరోసారి ధృవీకరించుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, కచ్చితంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమాన్ని చేపడుతోందని పేర్కొన్నారు. అదేవిధంగా, తమ పరిధిలోని బూత్ లెవల్ ఆఫీసర్ (BLO)ను సంప్రదించి అవసరమైన వివరాలను అందించాలని, ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో మార్పులు ఉంటే వాటిని సరిచేయించుకోవాలని సూచించారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం, అనర్హ పేర్ల తొలగింపు, ఓటరు జాబితా ప్రక్షాళనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా "మన ఓటు.. మన హక్కు.. మన బాధ్యత" అనే నినాదంతో ప్రజలందరూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని రమేష్ రెడ్డి బసంత్‌పూర్ విజ్ఞప్తి చేశారు.

## పిఆర్‌సి ప్రకటించి, వెంటనే అమలు చేయాలి: తపస్ రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్

**మెదక్ టౌన్ వెలుతురు జూన్ 25:**

మెదక్ పట్టణంలోని సత్య సాయి మందిరంలో నిర్వహించిన తపస్ అభ్యాస వర్గ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తపస్ రాష్ట్ర అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ హనుమంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్త్ కార్డుల సంబంధించిన విధివిధానాలు వెంటనే ప్రకటించాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వకుండా వారి జీతాల నుండి 1.5 శాతం తీసుకోవడం సరైంది కాదని, వెంటనే పెండింగ్ డి ఏ లను విడుదల చేయాలని, పిఆర్సిని ప్రకటించి, వెంటనే అమలు చేయాలని, జీవో 317 ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, సి పి ఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ అమలు చేయాలి అని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, మోడల్ స్కూల్, కేజీబీవీ, రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, జాల సిద్దూ, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దుబాషి భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్, రంగా రెడ్డి, వెంకట స్వామి, జిల్లా కోశాధికారి మంగ నర్సింలు, జిల్లా ఉపాధ్యక్షులు మెట్టు శేఖర్, శ్రీధర్ రెడ్డి, మాధవ రెడ్డి , జిల్లా, అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.




## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ వెలుతురు జూన్ 25:**

కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా ఈరోజు నగరంలోని 33వ డివిజన్‌లో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుధ్య సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ హీనా అఫ్రిన్, కో–ఆప్షన్ సభ్యులు నందకుమార్, బల్బీర్ సింగ్, ఎం.డి. ముజీబ్, మున్సిపల్ అధికారులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.అనంతరం 58వ డివిజన్‌లోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ చుట్టూ నిర్మించనున్న కాంపౌండ్ వాల్ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం గారితో కలిసి భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా నగర అభివృద్ధితో పాటు ప్రజల భద్రతకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో కూడా నగరపాలక సంస్థ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు సర్దార్ రవీందర్ సింగ్, చంద్ర, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వాణిజ్య ఎల్‌పీజీ సరఫరాపై ఆంక్షలు ఎత్తివేసిన కేంద్రం

- **పారిశ్రామిక రంగానికి భారీ ఊరట**

**న్యూఢిల్లీ, వెలుతురు జూన్ 25:**

పారిశ్రామిక, వాణిజ్య ఎల్‌పీజీ (గ్యాస్) వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం గురువారం భారీ ఊరటనిచ్చింది. పశ్చిమ ఆసియా సంక్షోభం సద్దుమణగడం, దేశీయంగా గ్యాస్ ఉత్పత్తి మెరుగుపడటంతో నాన్–డొమెస్టిక్ ప్యాక్డ్ ఎల్‌పీజీ సరఫరాపై ఉన్న అన్ని రకాల రంగాధారిత ఆంక్షలను తక్షణమే తొలగిస్తూ కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో సంక్షోభానికి ముందు ఉన్న స్థాయిలోనే సరఫరాలను పునరుద్ధరించింది. సంక్షోభం ప్రారంభంలో పూర్తిగా నిలిపివేసిన బల్క్ ఎల్‌పీజీ సరఫరాను కూడా 50 శాతం వినియోగ మార్గదర్శకాలతో పునరుద్ధరించారు.గతంలో అంతర్జాతీయ సరఫరా గొలుసు దెబ్బతిన్న సమయంలో నిత్యావసర వస్తువుల చట్టం కింద సి3, సి4 స్ట్రీమ్స్‌ను పూర్తిగా ఎల్‌పీజీ ఉత్పత్తికే వాడాలని కేంద్రం ఆదేశించింది. పెట్రోకెమికల్, ఇతర పరిశ్రమలకు వీటిని నిలిపివేసింది. ప్రస్తుతం దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తి పెరగడం, దిగుమతులు సాఫీగా సాగే అవకాశం ఉండటంతో ఈ మళ్లింపును తగ్గించాలని కేంద్రం నిర్ణయించింది. దీనివల్ల పెట్రోకెమికల్ రంగానికి అవసరమైన కేటాయింపులు పెరగనున్నాయి. అయితే దేశీయంగా గృహ వినియోగ గ్యాస్ కొరత రాకుండా, రోజువారీ ఉత్పత్తి కనీసం 40 టీఎంటీ తగ్గకుండా చమురు సంస్థలు జాగ్రత్తలు తీసుకుంటాయి. సెంటర్ ఆఫ్ హై టెక్నాలజీ సంస్థ దీనిపై నిరంతరం పర్యవేక్షణ జరిపి నివేదికలు సమర్పిస్తుంది.అంతర్జాతీయంగా సమస్యలు ఉన్నప్పటికీ దేశంలోని గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత రాకుండా కేంద్రం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది.

# రాహుల్ కు న్యాయం చేయాలి

- కోరుట్లలో పద్మశాలీలు, గ్రామస్తుల భారీ నిరసన
- సిపిఐ విచారణ జరిపించాలి
- వెంటనే రాహుల్ మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించాలి
- జాతీయ రహదారిపై ధర్నా రాస్తారోకో
- దేశవ్యాప్త ఉద్యమ నిర్మిస్తాం

**జగిత్యాల జిల్లా వెలుతురు జూన్ 25:**





జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ కు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి అంకం రాహుల్ మృతిపై అనుమానాలు నివృత్తి చేసి, మృతికి కారకులైన వారిని చట్టపరంగా శిక్షించాలని కోరుతూ కోరుట్ల లో పద్మశాలీ సంఘం నాయకులు , గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థి రాహుల్ మృతి మిస్టరీ ఛేదనలో పోలీసులు జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ప్లకార్డులతో నిరసనకు దిగారు. హైద్రాబాద్ లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న అంకం రాహుల్ ఆంధ్రప్రదేశ్ లోని సింగరాయ కొండ ప్రాంతంలోని పాడుబడిన బావిలో ఇటీవల శవమై తేలాడు. ఇందుకు సంబందించి అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. రాహుల్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో హైద్రాబాద్ కాచిగూడ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. ఈనేపథ్యంలో రాహుల్ మృతి చెంది నెల రోజులు గడుస్తున్న పోలీసులు రాహుల్ శవాన్ని కుటుంబసభ్యులకు అందజేయకపోవడాన్ని నిరసిస్తూ పద్మశాలీ సంఘాల నాయకులు, కులస్తులు, అయిలాపూర్ గ్రామస్తులు పెద్ద ఎత్తున కోరుట్ల కు చేరుకున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కోరుట్ల లోని కార్గిల్ చౌరస్తా జాతీయ రహదారిపై భైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ మాట్లాడుతూ.విద్యార్థి అంకం రాహుల్ మృతి బాధకరమన్నారు. 25 రోజులు గడుస్తున్నా రాహుల్ మృతిపై రెండు రాష్ట్రాల పోలీసులు ఖచ్చితమైన సమాచారాన్ని ఇవ్వడం లేదన్నారు. రాహుల్ ను బెదిరింపులకు గురి చేసిన వ్యక్తులపై ఇప్పటి వరకు ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి మరణిస్తే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి కనీస స్పందన లేదన్నారు. ఈవిషయంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలనీ, రాహుల్ మృతిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. మృతికి కారణమైన వారు ఎంతటి వారైనా చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీసీ బిడ్డకు న్యాయం జరిగే వరకు విశ్రమించేది లేదని ఉద్ఘాటించారు. అనంతరం కార్గిల్ చౌక్ నుంచి జాతీయ రహదారి మీదుగా కొత్త బస్టాండు వరకు ర్యాలీగా వెళ్లారు. అంబేద్కర్ విగ్రహానికి రాహుల్ తల్లిదండ్రులు లతో కలిసి నాయకులు వినతి పత్రం అందజేశారు. అంతకుముందు పద్మశాలీ సంఘం నేతలు కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహనికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కమర్తపు మురళి అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, సెక్రటరీ జనరల్ గడ్డం జగన్నాథం, అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ ఇంచార్జ్ అవ్వారి భాస్కర్ అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం అధ్యక్షులు బోళ్ళ శివశంకర్ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు మెతుకు సత్యం గారు ఉపాధ్యక్షులు గుర్రం శ్రవణ్ బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్, రుద్ర శ్రీనివాస్, భోగ వెంకటేశ్వర్లు రామకృష్ణ, స్థానిక పద్మశాలి సంఘ నేతలు పాల్గొన్నారు .

# నషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

- అదనపు జిల్లా కలెక్టర్ డా. కిరణ్మయి

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 25:**

రంగారెడ్డి జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన "నషా ముక్త్ భారత్ అభియాన్" (NMBA) కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ డా. కిరణ్మయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత జీవితాన్నే కాకుండా కుటుంబాలు, సమాజం మరియు దేశ భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు.ప్రభుత్వం చేపడుతున్న "నషా ముక్త్ భారత్ అభియాన్" ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.వ్యసన రహిత సమాజ నిర్మాణంలో ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు మరియు ప్రజలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. "వికసిత్ భారత్‌కు నషా ముక్త్ భారత్ పునాది" అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా ఇతరులను కూడా చైతన్యపరిచి ఆరోగ్యవంతమైన, సురక్షితమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.సమాజంలో జరుగుతున్న నేరాలు, ముఖ్యంగా పిల్లలపై జరిగే అఘాయిత్యాలను అత్యంత తీవ్రంగా పరిగణించాలని ఆమె అన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద సంఘటనలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్యాలు (డ్రగ్స్) మరియు మద్యం (ఆల్కహాల్) అనేక నేరాలు, రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.పిల్లలను డ్రగ్స్ మరియు ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, "నాకెందుకులే" అనే నిర్లక్ష్య భావనకు బదులుగా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సమాజం సురక్షితంగా, ఆరోగ్యకరంగా ఉంటేనే వ్యక్తులు, కుటుంబాలు కూడా సంతోషంగా ఉంటాయని తెలిపారు. అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ సహకరిస్తారని, అందరూ కలిసి పనిచేస్తేనే నేరాలు మరియు సామాజిక సమస్యలను సమర్థవంతంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.అనంతరం అదనపు కలెక్టర్ అందరి చేత "నేను మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని నేను డ్రగ్స్ రహిత జీవ నశైలిని అనుసరిస్తూ నాతోపాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండటానికి కృషి చేస్తానని డ్రగ్స్ అమ్మకం కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజే స్తానని నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయించారు."ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంత్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ మరియు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, కలెక్టరేట్ ఎఓ సునీల్, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






# బిల్లులు వచ్చాయిగా ఇక అక్రమాలు ఆపండి

- మమ్మల్ని పీడించకండి వేదించకండి.
- ఇసుక క్వారీలలో కాంట్రాక్టర్ల అక్రమ వసూళ్ళని ఆరికట్టండి
- పెద్ద అంబార్ పేట ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 25:**

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ఇసుక ర్యాంపులలో కాంట్రాక్టర్లు చేస్తున్న అక్రమ వసూళ్లు, లారీ యజమానులు మరియు డ్రైవర్లపై జరుగుతున్న వేధింపులు రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ, TGMDC అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.ప్రభుత్వం నిర్ణయించిన రుసుములను TGMDC ద్వారా పూర్తిగా చెల్లించి ఇసుకను తీసుకువెళ్తున్నప్పటికీ, కాంట్రాక్టర్లు ఒక్కో లారీపై అదనంగా రూ.3,000 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారు. డిస్టినేషన్ పేరుతో TGMDC నుండి ఒక్కో లారీకి సుమారు రూ.5,000 వరకు చెల్లింపులు పొందుతున్నప్పటికీ, లోడింగ్ కోసం వచ్చిన లారీల నుండి మరోసారి రూ.3,000 వరకు వసూలు చేయడం కాంట్రాక్టర్ల అక్రమ దోపిడీకి నిదర్శనం. ఈ విధంగా TGMDC చెల్లింపులు మరియు లారీ యజమానుల నుండి వసూలు చేస్తున్న సొమ్ము కలిపి ఒక్కో లారీపై రూ.7,000 నుండి రూ.8,000 వరకు లబ్ధి పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ఇటీవల కాంట్రాక్టర్లకు బకాయిలు విడుదల చేసినట్లు తెలిసినప్పటికీ, అక్రమ వసూళ్లపై మాత్రం ఇప్పటివరకు ఎటువంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కాంట్రాక్టర్లపై ఫిర్యాదు చేసిన లారీ యజమానుల వాహనాలకు లోడింగ్ నిరాకరించడం, బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని బెదిరించడం, డ్రైవర్లను భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.అక్రమ వసూళ్లను ప్రశ్నిస్తున్న లారీ యజమానులు మరియు డ్రైవర్లపై తప్పుడు కేసులు నమోదు చేయిస్తామని, SC/ST అట్రాసిటీ కేసుల్లో ఇరికిస్తామని బెదిరింపులు వస్తున్నాయని పలువురు బాధితులు వాపోతున్నారు. ఈ ఆరోపణలపై కూడా నిష్పాక్షిక విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉంది.ఇట్టి అక్రమ లోడింగ్ వసూళ్ల ప్రభావం కేవలం లారీ యజమానులపైనే కాకుండా సామాన్య ప్రజలపై కూడా పడుతోంది. ఇసుక కొనుగోలు చేసే వినియోగదారులపై ఒక్కో టన్ను ఇసుకకు అదనంగా రూ.100 నుండి రూ.200 వరకు భారం పడుతోంది. ఫలితంగా గృహ నిర్మాణ ఖర్చులు పెరుగుతున్నాయి. కాంట్రాక్టర్ల అక్రమ వసూళ్ల



కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు రావడమే కాకుండా, ప్రభుత్వ ఆదాయ వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోంది.మేము TGMDC వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ గారికి సమగ్ర ఫిర్యాదు సమర్పించాము. రాష్ట్రవ్యాప్తంగా ఇసుక ర్యాంపులలో జరుగుతున్న అక్రమ వసూళ్లు, బినామీ నిర్వహణ, అధికారుల నిర్లక్ష్యం మరియు లారీ యజమానులపై జరుగుతున్న వేధింపులపై ఉన్నతస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము.

**మా ప్రధాన డిమాండ్లు**

1. రాష్ట్రవ్యాప్తంగా ఇసుక ర్యాంపులపై ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయాలి.
2. లోడింగ్ పేరుతో జరుగుతున్న అక్రమ వసూళ్లను వెంటనే నిలిపి వేయాలి.
3. ఫిర్యాదు చేసిన లారీ యజమానులు, డ్రైవర్లపై వేధింపులు మరియు బెదిరింపులను అరికట్టాలి.
4. బినామీ కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.
5. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలి.
6. అక్రమ వసూళ్ల ద్వారా వసూలు చేసిన మొత్తాలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలి.
7. అక్రమ వసూళ్లపై ఫిర్యాదు చేసిన లారీ యజమానుల వాహనాలకు లోడింగ్ నిరాకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.


ప్రభుత్వం మరియు TGMDC యాజమాన్యం తక్షణం స్పందించి న్యాయం చేయకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఇసుక లారీ యజమానులను ఏకం చేసి ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాము.అధ్యక్షుడు పోలగోని భాస్కర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ , ఉపాధ్యక్షుడు మునుకుంట్ల బలరాం, అసోసియేషన్ సభ్యులు యాదగిరి, శ్రీను,వెంకన్న , రాజిరెడ్డి, రాజేష్

# వెనెజువెలాలో మహా ప్రళయం

- వరుస భూకంపాలతో అతలాకుతలం
- 164 మంది పౌరుల మృతి
- లక్ష మంది మృతి చెందొచ్చన్న యూఎస్‌జీఎస్
- ఒక్కసారిగా వణికిపోయిన వెనెజువెలా దేశం
- దేశంలో అత్యవసర పరిస్థితి విధిస్తూ ప్రకటన
- యుద్ధప్రాతిపదికన శిథిలాల తొలగింపు..
- కొనసాగుతున్న ఆర్తనాదాలు, రెస్క్యూ ఆపరేషన్స్
- వైద్యం అందక క్షతగాత్రుల రోదన
- కుప్పకూలిన విద్యుత్, సమాచార నెట్‌వర్క్‌లు
- వెనెజువెలాకు అండగా ఉంటామన్న డొనాల్డ్ ట్రంప్
- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ

**వెనెజువెలా వెలుతురు జూన్ 25:**

దక్షిణ అమెరికా దేశమైన వెనెజువెలాలో ప్రకృతి ఒక్కసారిగా కన్నెర్ర జేసింది. దారుణ వరుస భూకంపాల ధాటికి దేశం మొత్తం వణికిపోయింది. అమెరికా భూగర్భ సర్వే సంస్థ (యూఎస్‌జీఎస్) వెల్లడించిన అధికారిక వివరాల ప్రకారం, రాజధాని కారకాస్ నగరానికి పశ్చిమ దిశలో ఉన్న శాన్ ఫెలిపే ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని మొదట రిక్టర్ స్కేలుపై 7.2 తీవ్రతతో అత్యంత శక్తివంతమైన భూకంపం సంభవించింది. ఈ భీభత్సం నుంచి ప్రజలు కోలుకోకముందే, కేవలం కొద్ది క్షణాల వ్యవధిలోనే యుమారే ప్రాంతంలో 7.5 తీవ్రతతో రెండో భూకంపం భూభాగాన్ని కుదిపేసింది. ఒకే ప్రాంతంలో దాదాపు ఒకే సమయంలో ఇంతటి తీవ్రమైన భూకంపాలు రావడం వల్ల ఊహించని స్థాయిలో నష్టం వాటిల్లింది.ఈ ఘోర విపత్తు నేపథ్యంలో వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెజ్ దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని విధిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశ ప్రజలను ఉద్దేశించి ఆమె జాతీయ టెలివిజన్ ఛానల్ ద్వారా అత్యంత ఆవేదనతో మాట్లాడారు. ఈ భూకంపాల వల్ల ఇప్పటి వరకు అధికారిక లెక్కల ప్రకారం 164 మంది దుర్మరణం పాలయ్యారని, మరో 971 మంది తీవ్రంగా గాయపడ్డారని ఆమె ధ్రువీకరించారు. విపత్తులో తమ కళ్ల ముందే కుటుంబ సభ్యులను, ఆత్మీయులను కోల్పోయి రోదిస్తున్న బాధితులకు ఆమె ప్రభుత్వం తరఫున సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వ యంత్రాంగం అంతా ప్రాణాలు కాపాడే పనిలోనే నిమగ్నమై ఉందని చెప్పారు.భూకంప తీవ్రతకు రాజధాని కారకాస్ నగరంతో పాటు చుట్టుపక్కల ఉన్న వందలాది నివాస, వాణిజ్య భవనాలు చేతులెత్తేసి ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి. దీంతో భారీ కాంక్రీట్ శిథిలాల కింద వేలాది మంది ప్రజలు చిక్కుకుపోయి ఉంటారని అధికారులు బలంగా అనుమానిస్తున్నారు. విపత్తు స్పందన బృందాలు, ఆర్మీ బలగాలు రంగంలోకి దిగి అత్యాధునిక యంత్రాల సహాయంతో శిథిలాలను తొలగిస్తూ రెస్క్యూ ఆపరేషన్స్ (సహాయక చర్యలు) ప్రారంభించాయి. శిథిలాల లోపలి నుంచి వస్తున్న బాధితుల ఆర్తనాదాలు అక్కడి వారిని కన్నీరు పెట్టిస్తున్నాయి. వీలైనంత ఎక్కువ మందిని ప్రాణాలతో బయటకు తీసేందుకు రక్షణ సిబ్బంది నిరంతరాయంగా శ్రమిస్తున్నారు.ప్రస్తుతం వెనెజువెలా ప్రభుత్వం చెబుతున్న మరణాల సంఖ్య కేవలం ప్రాథమికం మాత్రమేనని, అసలు విధ్వంసం ఇంకా బయటకు రాలేదని అంతర్జాతీయ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అమెరికా జియోలాజికల్ సర్వే ఈ విపత్తుపై అత్యంత దిగ్భ్రాంతికరమైన, భయానకమైన అంచనాలను విడుదల చేసింది. భూకంపాలు సంభవించిన కేంద్రం, అక్కడి జనాభా సాంద్రత, భవనాల నిర్మాణ శైలిని విశ్లేషించిన యూఎస్‌జీఎస్.. ఈ భూకంపాల వల్ల మరణించిన వారి సంఖ్య కనీసం 10 వేల నుంచి గరిష్టంగా లక్ష వరకు ఉండవచ్చని హెచ్చరించింది. అయితే ఈ ఘోరమైన సంఖ్యలు ప్రాథమిక నమూనా ఆధారంగా అంచనా వేసినవి మాత్రమేనని, పూర్తి వివరాలు తెలియడానికి మరికొన్ని రోజులు పడుతుందని పేర్కొంది.భూకంపాల ధాటికి ప్రభావిత ప్రాంతాల్లోని మౌలిక సదుపాయాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. విద్యుత్ లైన్లు తెగిపడటం, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడంతో రాత్రి వేళల్లో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. టెలిఫోన్ టవర్లు కూలిపోవడం వల్ల సమాచార వ్యవస్థ (కమ్యూనికేషన్ నెట్‌వర్క్) పూర్తిగా స్తంభించిపోయింది. ఎక్కడ ఎవరు చిక్కుకున్నారో తెలుసుకోవడం అధికారులకు కష్టంగా మారింది. మరోవైపు గాయపడిన వందలాది మందితో స్థానిక ఆసుపత్రులు కిక్కిరిసిపోయాయి. మందులు, రక్తం, వైద్య సిబ్బంది కొరత కారణంగా క్షతగాత్రులు సరైన వైద్యం అందక ఆసుపత్రి వరండాల్లోనే అల్లాడిపోతున్నారు.వెనెజువెలాలో జరిగిన ఈ ఘోర విపత్తుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తక్షణమే స్పందించారు. ప్రకృతి సృష్టించిన ఈ మహా వినాశనంలో పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కష్టకాలంలో వెనెజువెలా ప్రజలను ఆదుకునేందుకు, వారికి అవసరమైన అన్ని రకాల మానవతా సాయాన్ని అందించేందుకు అమెరికా పూర్తి సిద్ధంగా ఉందన్నారు. అమెరికా విదేశీ సహాయ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక విపత్తు సహాయక బృందాన్ని, టాస్క్‌ఫోర్స్‌ను ట్రంప్ ఏర్పాటు చేశారు. శోధన ప్రహరీ కుక్కలు, నిపుణులైన వైద్యులు, అత్యవసర



ప్రాణరక్షక మందులు మరియు ఆహార సామగ్రిని తొలి విడతలోనే ప్రత్యేక విమానాల ద్వారా వెనెజువెలా తాత్కాలిక ప్రభుత్వానికి పంపేందుకు శరవేగంగా చర్యలు చేపట్టారు.భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం వెనెజువెలా భూకంప విధ్వంసంపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆయన ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. "భారతదేశ ప్రజల తరఫున వెనెజువెలా తాత్కాలిక ప్రభుత్వానికి, అక్కడి ప్రజలకు నా హృదయ పూర్వక సంతాపాన్ని తెలియజేస్తున్నాను. తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాల బాధను మేము పంచుకుంటున్నాము. గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. ఈ క్లిష్ట సమయంలో భారత్ ఎల్లప్పుడూ వెనెజువెలాకు అండగా నిలుస్తుంది. రెస్క్యూ ఆపరేషన్ల కోసం భారతదేశం తరఫున ఎలాంటి సహాయం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.వెనెజువెలాలో సంభవించిన ఈ ఘోర భూకంపాల తీవ్రత ప్రపంచ దేశాలను కదిలించింది. ఇప్పటికే తీవ్ర ఆర్థిక, రాజకీయ సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతున్న ఆ దేశానికి ఈ ప్రకృతి వైపరీత్యం ఒక పెద్ద శాపంగా మారిందని ఐక్యరాజ్యసమితి సహా పలు అంతర్జాతీయ మానవతా సంస్థలు ఆవేదన వ్యక్తం చేశాయి.

కేవలం అమెరికా, భారత్ మాత్రమే కాకుండా ప్రపంచంలోని మిగిలిన అభివృద్ధి చెందిన దేశాలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వెనెజువెలాకు ఆహారం, తాగునీరు, తాత్కాలిక వసతి గృహాల (టెంట్లు) ఏర్పాటుకు నిధులు, సామగ్రిని సమకూర్చాలని, ఈ విపత్కర సమయంలో మానవత్వాన్ని చాటుకోవాలని అంతర్జాతీయ సమాజం పిలుపునిచ్చింది.



# నల్గొండ హత్యల కేసులో సంచలన మలుపు

- పక్కా ప్లాన్‌తోనే సుపారీ గ్యాంగ్ ఘాతుకం
- పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు
- ఆధారాలు దొరక్కుండా పక్కా వ్యూహం..
- పదునైన ఆయుధాలతో విచక్షణార హితంగా దాడి..
- పోస్ట్‌మార్టం, ఫోరెన్సిక్ నివేదికల్లో షాకింగ్ విషయాలు
- కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలే కారణమా?
- నిందితుల రహస్య విచారణ

**నల్లగొండ వెలుతురు జూన్ 25:**



నల్గొండ జిల్లా కేంద్రంలోని తెలంగాణ కాలనీలో ఇటీవల వెలుగుచూసిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురి అనుమానాస్పద మృతి కేసు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మొదట్లో ఇది ఆత్మహత్య కావచ్చునని భావించినప్పటికీ, పోలీసుల లోతైన దర్యాప్తులో ఇదో పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన ఘోర నరమేధమని తేలింది. ఇంటి యజమాని మహ్మద్ సుల్తాన్ (45), ఆయన భార్య హసీనా (38), కుమారుడు ముజామిల్(20), కుమార్తె అఫోర(14)లను గుర్తుతెలియని నిందితులు విచక్షణార హితంగా దాడి చేసి అతి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ దారుణ ఉదంతం వెనుక పెద్ద కుట్రే దాగి ఉందని నిర్ధారణ కావడంతో ఈ కేసు ఒక్కసారిగా కీలక మలుపు తిరిగింది.

ఈ నెల 22వ తేదీన ఈ దారుణ హత్యలు వెలుగులోకి వచ్చాయి. హంతకులు అత్యంత తెలివిగా వ్యవహరించి, ఘటనా స్థలంలో వేలిముద్రలు కానీ, తాము వాడిన వస్తువులు కానీ దొరక్కుండా జాగ్రత్తపడ్డారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌కు కూడా తొలుత ఎలాంటి కీలక ఆధారాలు లభించలేదు. అయినప్పటికీ నల్గొండ పోలీసులు సవాలుగా తీసుకుని క్షేత్రస్థాయిలో గాలించారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీలు, పాత నేరస్థుల రికార్డులను పరిశీలించి చివరకు ఈ పాడుపనికి ఒడిగట్టిన ఒక సుపారీ (హంతక) గ్యాంగ్‌ను గుర్తించారు. ఈ ముఠాలోని ఆరుగురు సభ్యులను పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా అదుపులోకి తీసుకుని, ఓ రహస్య ప్రాంతంలో ఉంచి విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.మృతదేహాలను పరిశీలించిన వైద్యులు, ఫోరెన్సిక్ నిపుణులు నివేదికలో షాకింగ్ విషయాలను వెల్లడించారు. బాధితుల శరీరాలపై తీవ్రమైన గాయాలు ఉన్నాయని, చనిపోయే ముందు వారు తీవ్రంగా నిరోధించ డానికి ప్రయత్నించారని తేలింది. హంతకులు వేటకొడవళ్లు లేదా పదునైన చాకులతో నలుగురిపై విచక్షణారహితంగా దాడి చేసి కిరాతకంగా నరికి చంపినట్లు ఫోరెన్సిక్ రిపోర్టులో స్పష్టమైంది. తల, మెడ భాగాలపై బలంగా గాయాలు కావడంతోనే వారు అక్కడికక్కడే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఇది ముమ్మాటికీ అద్దె హంతకులతో చేయించిన పక్కా స్కెచ్ అని పోలీసులు ఒక ముగింపునకు వచ్చారు.ఈ దారుణ హత్యలకు కుటుంబ వివాదాలు లేదా ఆస్తి తగాదాలే ముఖ్య కారణమై ఉండవచ్చని పోలీసులు బలంగా అనుమానిస్తున్నారు. నల్గొండ నగరంలోని ప్రకాశం బజార్‌లో సుల్తాన్ బ్యాగులు విక్రయించే వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన మొదటి భార్య గతంలోనే మరణించగా, హసీనాను రెండో వివాహం చేసుకున్నారు. ఇప్పుడు చనిపోయిన పిల్లలిద్దరూ మొదటి భార్య సంతానమని స్థానికులు చెబుతున్నారు. హసీనా ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పని చేస్తుండగా, కొడుకు ముజామిల్ ఏసీ టెక్నీషియన్‌గా చేస్తున్నాడు. అయితే, గత కొంతకాలంగా సుల్తాన్, హసీనా దంపతుల మధ్య తీవ్ర మనస్పర్థలు ఉన్నాయని, సుల్తాన్ తరచూ మద్యం సేవించి ఇంట్లో గొడవ పడేవాడని పొరుగువారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.పోలీసుల టైమ్‌లైన్ విశ్లేషణ ప్రకారం జూన్ 19వ తేదీ రాత్రి ఈ ఘోరం జరిగినట్లు తెలుస్తోంది. ఆ రోజు రాత్రి సుల్తాన్ వ్యాపారం ముగించుకుని ఇంటికి రాగా, కొడుకు ముజామిల్ కూడా రాత్రి 10 గంటల ప్రాంతంలో పని ముగించుకుని వచ్చాడు. అయితే ఆ రోజు అర్ధరాత్రి 11 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 4 గంటల మధ్య ఆ ఇంట్లోకి సుపారీ గ్యాంగ్ ప్రవేశించినట్లు భావిస్తున్నారు. ఆ సమయంలో సదరు ఇల్లు ఉన్న వీధిలో భయంకరమైన 'బచావో.. బచావో' (కాపాడండి) అనే ఆర్తనాదాలు, హాహాకారాలు వినవచ్చాయని స్థానికులు కొందరు పోలీసుల ఎదుట నోరు విప్పారు. కానీ, సాధారణ కుటుంబ గొడవలే కావచ్చునని భావించి ఎవరూ అటువైపు వెళ్లలేదని, తీరా చూసేసరికి నలుగురూ శవాలై కనిపించారని కన్నీరుమున్నీరవుతున్నారు.హంతకులు ఎంతటి క్రూరులంటే.. నలుగురిని ప్రాణాలు పోయే వరకు నరికి చంపిన తర్వాత, వారి మృతదేహాలు బయటకు కనిపించకుండా ఇళ్లలో ఉండే చద్దర్లను (దుప్పట్లు) వాటిపై కప్పేశారు. ఆ తర్వాత తాము వచ్చిన పని ముగించుకుని హ్యాపీగా బయటకు వచ్చి, ఇంట్లో ఎవరూ లేరనే భ్రమ కలిగించడానికి వీధి వైపు ఉన్న ప్రధాన గేటుకు పక్కాగా తాళం (లాక్) వేసి పారిపోయారు. ఇలా చేయడం వల్ల శవాలు కుళ్లిపోయే వరకు ఎవరికీ అనుమానం రాదని, ఆధారాలు సేకరించడం పోలీసులకు కష్టసాధ్యంగా మారుతుందని హంతకులు భావించారు. కాలనీలో దుర్వాసన రావడంతోనే ఈ దారుణ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.పోలీసులు ఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు ఇల్లంతా చెల్లాచెదురుగా పడి ఉంది. బెడ్‌రూమ్‌లోని బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. బట్టలు, ఇతర వస్తువులన్నీ కింద పడేసి ఉన్నాయి. దీన్ని బట్టి హంతకులు ఇంట్లో ఉన్న భారీ నగదు, బంగారు ఆభరణాలను దోచుకెళ్లినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే గతంలో కూడా ఇదే సుల్తాన్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి భారీ దోపిడీకి పాల్పడినట్లు నల్గొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ఉంది. ఆ పాత దొంగతనం కేసుతో ఈ నలుగురి హత్యలకు ఏమైనా లింకు ఉందా? లేదా దోపిడీ దొంగలే ఈ ఘాతుకానికి ఒడిగట్టారా? అనే కోణాన్ని కూడా పోలీసులు వదిలిపెట్టడం లేదు.ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న ఆరుగురు సుపారీ గ్యాంగ్ సభ్యుల విచారణ అత్యంత రహస్యంగా సాగుతోంది. నల్గొండ జిల్లా ఎస్పీ స్వయంగా ఈ కేసును పర్యవేక్షిస్తున్నారు. కేవలం డబ్బు కోసమే ఈ అద్దె హంతకులు ఇంతటి దారుణానికి ఒడిగట్టారా? లేక ఈ కుటుంబంతో శత్రుత్వం ఉన్నవారెవరైనా వీరికి పెద్ద మొత్తంలో డబ్బు ఆశ చూపి సుపారీ ఇచ్చారా? అనే విషయాలు తేలాల్సి ఉంది. ఈ ముఠా నోరు విప్పితే, ఈ దారుణ నరమేధానికి వెనుక ఉండి నడిపించిన అసలు సూత్రధారులు, వారి కుటుంబ నేపథ్యం, ఆస్తి వివాదాల పూర్తి వివరాలు అధికారికంగా వెలుగులోకి వస్తాయి. ఈ క్రైమ్ మిస్టరీని ఛేదించేందుకు పోలీసులు మరికొన్ని గంటల్లో అధికారికంగా ప్రెస్ మీట్ నిర్వహించే అవకాశం ఉంది.

# నేడే విద్యుత్తు భద్రత వారోత్సవాలు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 26:**

జూన్ 26 నుండి జులై 2 తారీకు వరకు ప్రభుత్వ సంస్థలు గాని ప్రవేట్ సంస్థల్లో గాని గృహప్రము దాయంలో గాని ఇండస్ట్రీలో గానీ కమర్షియల్ కాంప్లెక్స్ లో గాని విద్యుత్ భద్రత వారోత్సవాలు జరుపుకోవాలని సూచనగా మీ నక్క యాదగిరి

1. మెయిన్ స్విచ్ ఆఫ్ చేయండి లేదా ప్లగ్ తీసేయండి.
2. రబ్బర్ కర్ర చెప్పు పొడి వస్తువులతో బాధితుల్ని లాగండి. చేత్తో ముట్టుకోవద్దు. విద్యుత్ ప్రమాదం జరిగినప్పుడు.
3. వెంటనే 108 కు కాల్ చేయండి.
4. ఊపిరి లేకపోతే సిపిఆర్ చేయండి
5. టిజిఎస్పీడీసీఎల్. టీజీ ఎన్పీడీసీఎల్ టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయండి.1912
6. షాక్ తగిలిన ఎమ్మటే మెయిన్ స్విచ్ ఆఫ్ చేయండి.

గృహ సముదాయంలో ఎం సి బి. ఈ ఎల్ సి బి. ఆర్ సి సి బి. విద్యుత్ పలకడంలో వాడడం మర్చిపోకండి

ప్రజలు, విద్యుత్ సిబ్బందిలో కరెంటు వాడకంపై అవగాహన పెంపొందించడం, విద్యుత్ ప్రమాదాలను నివారించి సున్నాకు తీసుకురావడమే విద్యుత్ భద్రత వారోత్సవాల (Electrical Safety Week) ముఖ్య ఉద్దేశ్యం. ప్రతి సంవత్సరం నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ (NSC), సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (CEA) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు. వారోత్సవాల ముఖ్య ఉద్దేశాలు మరియు లక్ష్యాలు అవగాహన కల్పించడం, గృహాలు, పొలాలు, పరిశ్రమలలో కరెంటును ఎలా సురక్షితంగా వాడుకోవాలో ప్రజలకు వివరించడం. ప్రమాదాల నివారణ వేలాడుతున్న తీగలు, వంగిన స్తంభాలు, పాత వైర్లను గుర్తించి వాటికి తక్షణమే మరమ్మతులు చేయడం. రైతులు మరియు వినియోగదారులకు సూచనలు: వ్యవసాయ మోటార్లు, స్టార్టర్ల వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో రైతులకు అవగాహన సదస్సులు



నిర్వహించడం.పాటించాల్సిన ప్రాథమిక జాగ్రత్తలు నాణ్యమైన ఐ.ఎస్.ఐ (ISI) ప్రమాణాలు కలిగిన వైర్లు, ఎలక్ట్రికల్ పరికరాలను మాత్రమే వాడాలి.షార్ట్ సర్క్యూట్‌లను నివారించడానికి ఎర్త్ లీకేజ్ సర్క్యూట్ బ్రేకర్ (ELCB) లేదా మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్ (MCB)లను తప్పనిసరిగా ఉపయోగించాలి.వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు వెళ్లకూడదు.తెగిపడిన విద్యుత్ తీగలను తాకరాదు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.ఈ వారోత్సవాలలో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో "పొలం బాట" లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ, వినియోగదారులకు కరపత్రాలు పంచుతారు. తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విద్యుత్ సంస్థలు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా చేపడుతున్నాయి.

తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యుడు.

తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

తెలంగాణ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

మీ నక్క యాదగిరి

మరిన్ని వివరాల కోసం సంప్రదించగలరు

# తెలంగాణ నీటి ప్రయోజనాలను తాకట్టు పెట్టారు

- రేవంత్ రెడ్డిపై హరీష్ రావు ఫైర్
- గేట్లు మార్చినంత మాత్రాన ఆర్డీఎస్ నీళ్లు ఎలా వస్తాయి?
- ట్రిబ్యునల్ అవార్డులో లేని "సిస్టమ్ లాసెస్" అంగీకారం ఎందుకు?
- 'నవేలి', 'గుండ్రేవుల' ప్రాజెక్టులపై రేవంత్ మౌనం దేనికి?
- ఆంధ్రా తూముల మూసివేత, కాలువ మరమ్మతుల హామీ ఏది?

**హైదరాబాద్, వెలుతురు జూన్ 25:**

కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్ నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఒక 'సువర్ణ అధ్యాయం'గా చిత్రీకరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రచారం కేవలం నిష్ప్రయోజనమైన డ్రామా అని బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తీవ్రంగా ధ్వజమెత్తారు. సరిహద్దు రాష్ట్రాల్లో జరుగుతున్న వేడుకల్లో పాల్గొని సంబురాలు చేసుకోవడం పక్కనపెట్టి, కృష్ణా మరియు తుంగభద్ర జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా గురించి ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను నిలదీస్తూ హరీష్ రావు ఒక ప్రకటన విడుదల చేశారు.



రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) నీటి వాటా విషయంలో తెలంగాణకు జరుగుతున్న ఘోర అన్యాయంపై రేవంత్ రెడ్డి పొరుగు రాష్ట్రాల నుంచి ఏదైనా స్పష్టమైన హామీ సాధించారా? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఆంధ్రా వైపు చట్టవిరుద్ధంగా ఉన్న ఆర్డీఎస్ తూములను శాశ్వతంగా మూసివేసేలా, ఆర్డీఎస్ ఆనకట్టకు మరమ్మతులు చేసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి ఒప్పించారా? అని నిలదీశారు. అలాగే, కర్ణాటక పరిధిలో ఉన్న ఆర్డీఎస్ ప్రధాన కాలువకు తక్షణమే మరమ్మతులు చేసి, క్రమం తప్పకుండా నిర్వహించేలా ఆ రాష్ట్రం నుంచి ఏమైనా లిఖితపూర్వక హామీ తీసుకున్నారా? అని అడిగారు. ఈ పనులు జరగకపోవడం వల్లే ఆర్డీఎస్ కింద తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన నీటి వాటా ప్రతిసారీ కోల్పోవాల్సి వస్తోందని, కేవలం తుంగభద్ర డ్యామ్ గేట్లు మార్చినంత మాత్రాన తెలంగాణకు రావాల్సిన 15.90 టీఎంసీల నీరు రాదని స్పష్టం చేశారు. గత 75 ఏళ్లుగా పాత గేట్లు పనిచేస్తూనే ఉన్నాయని, అయినా కూడా ఆర్డీఎస్ ద్వారా తెలంగాణకు ఏనాడూ 5 టీఎంసీలకు మించి నీళ్లు రాలేదనే వాస్తవాన్ని గుర్తుచేశారు.

కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ అవార్డులో ఎక్కడా లేని "సిస్టమ్ లాసెస్" అనే కొత్త వాదనను రేవంత్ రెడ్డి ఎందుకు అంగీకరించారని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రిబ్యునల్ అవార్డు పరిధిలోనే లేని ఈ తప్పుడు విధానాన్ని అడ్డు పెట్టుకుని, తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను తగ్గించడానికి వీల్లేదన్నారు. కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిమితికి మించి వాడుకుంటున్న తీరును రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేకపోయారని మండిపడ్డారు. కేసీ కెనాల్ కోసం సుంకేసుల వద్ద ఆంధ్రా ప్రభుత్వం ఏకంగా 39 టీఎంసీల నీటిని వాడుకుంటోందని, దీనికి తోడు కర్ణాటకతో కుమ్మక్కై కేసీ కెనాల్‌కు వెళ్లాల్సిన దాదాపు 10 టీఎంసీల నదీ జలాలను ఆర్‌బీహెచ్ఎల్‌సీ, ఆర్‌బీఎల్ఎల్‌సీ లకు మళ్లిస్తున్నా తెలంగాణ సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు.

తెలంగాణ నీటి హక్కులకు ముప్పుగా మారే పొరుగు రాష్ట్రాల కొత్త ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ఎందుకు వ్యతిరేకించలేదని హరీష్ రావు ప్రశ్నించారు. తుంగభద్ర డ్యామ్, ఆర్డీఎస్ మధ్యలో దాదాపు 35 టీఎంసీలు వాడుకునేలా కర్ణాటక ప్రభుత్వం 'నవేలి రిజర్వాయర్' నిర్మించాలని చూస్తోందని, అలాగే ఆర్డీఎస్, సుంకేసుల మధ్య 20 టీఎంసీలు వాడుకునేలా ఆంధ్రప్రదేశ్ సర్కార్ 'గుండ్రేవుల ప్రాజెక్టు' కట్టాలని ప్లాన్ చేస్తోందని వివరించారు. ఈ రెండు ప్రాజెక్టుల వల్ల కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాకు తీవ్ర గండిపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్ని ప్రధాన సమస్యల్లో ఏ ఒక్కదానికీ పరిష్కారం చూపకుండా, తెలంగాణ ప్రయోజనాలను గాలికి వదిలేసి, ఫోటోలకు ఫోజులిస్తూ రేవంత్ రెడ్డి దేనికోసం సువర్ణ అధ్యాయం అంటూ సంబురాలు చేసుకుంటున్నారని హరీష్ రావు ధ్వజమెత్తారు.

# మొహరం పర్వదినం త్యాగం, సహనం, సోదరభావానికి ప్రతీక: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 25:**

మొహరం పర్వదినం త్యాగం, ధర్మనిరతి, సహనం మరియు సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ముహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ గారి మహోన్నత బలిదానాన్ని స్మరించుకుంటూ మొహరం జరుపుకుంటారని మంత్రి తెలిపారు. సత్యం, న్యాయం కోసం ఆయన చేసిన త్యాగం యావత్ మానవాళికి స్ఫూర్తిదాయకమని అన్నారు.తెలంగాణలో మొహరం వేడుకలు కుల, మత భేదాలకు అతీతంగా నిర్వహించబడటం రాష్ట్ర ప్రత్యేకత అని మంత్రి పేర్కొన్నారు. తరతరాలుగా హిందూ ముస్లింలు కలిసి పీర్ల ఊరేగింపులు నిర్వహించడం తెలంగాణ గంగా-జమునా తెహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తోందన్నారు.మొహరం పర్వదినం సమాజంలో ఐక్యత, సామరస్యం, పరస్పర గౌరవాన్ని పెంపొందించే సందర్భంగా నిలుస్తుందని, ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో మొహరం జరుపుకోవాలని మంత్రి కోరారు.



# ఇందిర వల్లే ఎస్టీ రిజర్వేషన్లు: మహేష్ కుమార్ గౌడ్

- గాంధీభవన్‌లో వ్యాఖ్యలు
- ఇందిర సేవలను కొనియాడారు
- కులసర్వేపై హర్షం
- కాంగ్రెస్ అందరికీ అండ
- బీఆర్ఎస్ శకం ముగిసింది
- 100 సీట్లే లక్ష్యం
- అభివృద్ధే ధ్యేయం
- కేటీఆర్, హరీష్‌పై విమర్శలు
- ఇందిరమ్మ ఇళ్ల ప్రస్తావన
- బస్సు యాత్రకు పిలుపు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 25:**

గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎస్టీ రిజర్వేషన్లు రావడానికి మాజీ ప్రధాని ఇందిరా గాంధీ తీసుకున్న నిర్ణయాలే కారణమని అన్నారు. ఆమె రిజర్వేషన్లు కల్పించకపోతే ఎంతో మంది ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల్లో ఉన్నత హోదాల్లో ఉండేవారు కాదని వ్యాఖ్యానించారు.రాహుల్ గాంధీ ఆకాంక్ష మేరకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో కులసర్వే నిర్వహించామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలిచిందని చెప్పారు.బీఆర్ఎస్ శకం ముగిసిందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లతో మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని పేర్కొన్నారు.కేటీఆర్, హరీష్ రావుపై విమర్శలు గుప్పించిన మహేష్ కుమార్ గౌడ్, పేదల గుండెల్లో ఇందిరా గాంధీ చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. పేదలకు ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ పేరుతో గృహ పథకాన్ని తీసుకొచ్చారని చెప్పారు. ఆదివాసీ కాంగ్రెస్ చేపట్టిన బస్సు యాత్రలో సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.






# రేవంత్ రియల్ ఎస్టేట్‌ను బొందపెట్టారు

- జనం నెత్తిన శఠగోపం పెట్టారన్న మాజీ మంత్రి
- కేసీఆర్ హయాంలో ఐటీ, పారిశ్రామిక రంగాల ప్రగతి
- రూ.30 లక్షల నుంచి రూ.3 కోట్లకు పెరిగిన భూముల ధరలు
- నాటి బీఆర్ఎస్ విజన్ ను గుర్తుచేసిన కేటీఆర్
- రియల్ కార్మికుల బతుకులు రోడ్డున పడ్డాయని ఆవేదన
- కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామని హెచ్చరిక

**హైదరాబాద్ వెలుతురు జూన్ 25:**



తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతూ సరికొత్త కాక రేపుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షమైన భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు 'నువ్వా-నేనా' అనే స్థాయిలో సాగుతున్నాయి. మరోవైపు రాబోయే రోజుల్లో తమ పట్టును మరింత పెంచుకునేందుకు భారతీయ జనతా పార్టీ కూడా గట్టిగా ప్రయత్నిస్తోంది. తాము చేసిన సంక్షేమ కార్యక్రమాలే మళ్లీ గెలిపిస్తాయని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ధీమాగా చెబుతుండగా, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాల వల్ల ప్రజలు మళ్లీ తమ వైపే చూస్తున్నారని బీఆర్ఎస్ శ్రేణులు గట్టి నమ్మకంతో ఉన్నాయి. వీటికి తోడు త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు వచ్చే అవకాశం ఉండటంతో, గులాబీ దళపతి కేటీఆర్ నేరుగా సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతున్నాయి.చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం, ఎస్ఐఆర్ (SIR) శిక్షణా సదస్సు గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపేలా కీలక ప్రసంగం చేశారు. "ప్రస్తుతం మన చేతిలో అధికారం లేదు, ప్రభుత్వ పగ్గాలు లేవు.. అయినా సరే మీలో ఎక్కడా గర్వం, ధైర్యం తగ్గలేదు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీట్లు పోయినా, ఎంపీ సీట్లు పోయినా, అధికారం చేజారినా ఇంతమంది సోదరులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఇక్కడ చూపిస్తున్న సంఘీభావం సామాన్యమైనది కాదు. ఈ అద్భుత దృశ్యాన్ని చూస్తుంటే అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ పార్టీల గుండెల్లో రైళ్లు ఉరుకుతున్నాయి" అంటూ కేటీఆర్ ఉద్ఘాటించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా ప్రజలకు చేసిందేమీ లేదని కేటీఆర్ దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి తనను తాను ఒక 'గుంపు మేస్త్రీ'గా చెప్పుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు. "రియల్ ఎస్టేట్ అంటేనే రేవంత్ రెడ్డి.. రేవంత్ రెడ్డి అంటేనే రియల్ ఎస్టేట్ అంటూ నాడు రంగురంగుల పోజులు కొట్టారు. కానీ ఈరోజు అధికారంలోకి వచ్చాక అదే రియల్ ఎస్టేట్ రంగాన్ని ఏం చేశారు? పూర్తిగా బొంద పెట్టారు. వంద ఫీట్ల లోతున పాతిపెట్టే దారుణమైన పని చేశారు" అంటూ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ తప్పుడు విధానాల వల్లే రాష్ట్రంలో భూముల కొనుగోళ్లు, అమ్మకాలు పూర్తిగా నిలిచిపోయాయని ఆరోపించారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు కేవలం ఓట్ల కోసమేనని ఇప్పుడు స్పష్టమైందని కేటీఆర్ విమర్శించారు. రైతు భరోసా, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500, నిరుద్యోగ భృతి వంటి అనేక హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారని, కానీ గద్దెనెక్కాక ఆ హామీలన్నింటినీ అటకెక్కించారని మండిపడ్డారు. గడిచిన రెండున్నరేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదని, ఇది స్పష్టమైన వాగ్దాన భంగమని దుయ్యబట్టారు. ప్రజాపాలన పేరుతో ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెప్పి, చివరకు సామాన్య జనం నెత్తిన శఠగోపం పెట్టారని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నాయకత్వంలో తెలంగాణ అంతటా, ముఖ్యంగా చేవెళ్ల పరిసర ప్రాంతాల్లో జరిగిన పారిశ్రామిక అభివృద్ధిని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో షాబాద్ పరిధిలోని చందన్‌వెల్లి, సీతారాంపూర్ ప్రాంతాల్లో ఎకరం భూమి ధర కేవలం రూ.30 లక్షలు మాత్రమే ఉండేదని చెప్పారు. తాము అధికారంలో ఉన్నప్పుడు అక్కడ అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులతో భారీ పారిశ్రామిక పార్కులను తీసుకువచ్చామని, ఐటీ రంగంతో పాటు వినూత్న మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా ఆయా ప్రాంతాల రూపురేఖలనే పూర్తిగా మార్చేశామని కేటీఆర్ స్పష్టం చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వ విజన్ కారణంగానే చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోకి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన దిగ్గజ కంపెనీలు తరలివచ్చాయని కేటీఆర్ గర్వంగా ప్రకటించారు. మైక్రోసాఫ్ట్, అమెజాన్ , వెల్స్‌ఫన్ వంటి మల్టీనేషనల్ కార్పొరేషన్లు తమ హయాంలోనే ఇక్కడ వందల కోట్ల పెట్టుబడులు పెట్టాయన్నారు. ఈ భారీ పరిశ్రమల రాకతో నాడు రూ.30 లక్షలు పలికిన ఎకరం భూమి ధర, నేడు షాబాద్, చేవెళ్ల పరిసరాల్లో రూ.3 కోట్లకు పైగా పెరిగిందని లెక్కలతో సహా వివరించారు. ఈ ప్రాంతాన్ని ఒక గ్లోబల్ హబ్‌గా మార్చిన ఘనత ముమ్మాటికీ కేసీఆర్ ప్రభుత్వానిదేనని కేటీఆర్ స్పష్టం చేశారు.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తీసుకుంటున్న అవగాహన లేని నిర్ణయాల వల్ల రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది తమ్ముళ్లు, చెల్లెళ్లు, కార్మికుల బతుకులు ఈరోజు రోడ్డున పడ్డాయన్నారు. బిల్డర్లు, మేస్త్రీలు, కూలీలు, సెంటిమెంట్ల వ్యాపారులు అంతా దివాళా తీసే దారుణమైన పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ పడిపోవడంతో దానికి అనుబంధంగా ఉండే సిమెంట్, స్టీల్, రవాణా రంగాలు కూడా తీవ్ర నష్టాల్లో కూరుకుపోయాయని, ఎందుకీ దుస్థితి వచ్చిందో రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరూ మరియు యువత లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.రాష్ట్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను, ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను బీఆర్ఎస్ కార్యకర్తలు నిరంతరం నిలదీస్తూనే ఉంటారని కేటీఆర్ స్పష్టం చేశారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలతో పాటు తదుపరి వచ్చే అన్ని ఎన్నికల్లోనూ గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను, అస్తవ్యస్త ఆర్థిక విధానాలను ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ మార్కు సంక్షేమ పాలనను మళ్లీ కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మరింత శక్తివంతంగా పుంజుకుని తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని

# పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా క్యూర్...

(మొదటి పేజీ తరువాయి)

గురువారం సచివాలయంలోని తన కార్యలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి గారు సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు.క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 వరకు స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెల 28వ తేదీ లోగా అన్ని లొకేషన్లను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా జూన్ 28లోగా సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు.

క్యూర్ పరిధిలో అత్యంత ముఖ్యమైన ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్నామని ఈ స్థలాల్లో అన్ డివైడెడ్ షేర్ క్రింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల రిజిస్ట్రేషన్ చేస్తామని మరోమారు స్పష్టం చేశారు.రాష్ట్రంలో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకే మోడల్ లో ఆర్.డి.ఓ., 



తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని వీలైనంత త్వరితగతిన పనులు ప్రారంభించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే, ఆర్.డి.ఓ. తహశీల్దార్ కార్యాలయాల భవనాల మరమ్మతులకు సంబంధించి హౌసింగ్ ఏ.ఈ. లు భవనాలను విజిట్ చేసి ప్రతిపధనలు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి, డి.ఎస్. లోకేశ్ కుమార్, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# తుంగభద్ర జల సమస్యకు తొలి పరిష్కార అడుగు

- జల వివాదాలకు ముగింపు లక్ష్యం
- మునీరాబాద్ సభలో సీఎం

**మునీరాబాద్ వెలుతురు జూన్ 25:**

కర్ణాటకలోని మునీరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తుంగభద్ర జలాల అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. తుంగభద్ర డ్యామ్ 33 గేట్ల పునరుద్ధరణ కార్యక్రమం కేవలం మరమ్మతులకే పరిమితం కాదని, మూడు తరాలుగా కొనసాగుతున్న జల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా పడిన తొలి అడుగని పేర్కొన్నారు. ఈ రోజు చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందన్నారు.లక్షలాది మంది రైతుల సమస్యలకు ఈ నిర్ణయం ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ చొరవతో మూడు రాష్ట్రాల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.రాజోలిబండ డైవర్షన్ స్కీం (ఆర్‌డీఎస్) కింద తెలంగాణకు కేటాయించిన 17.9 టీఎంసీల నీటిలో ప్రస్తుతం 5 నుంచి 6 టీఎంసీలే అందుతున్నాయని, దాదాపు 10 టీఎంసీల నీరు రాష్ట్రానికి రావడం లేదని చెప్పారు. తుంగభద్రలో మట్టి పేరుకుపోవడం, నీటి కేటాయింపుల అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.పంచాయితీల కంటే సమస్య పరిష్కారానికే తాను ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేసిన సీఎం, రాజకీయాలకు అతీతంగా జరిగిన చర్చలు అంతర్రాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలకంగా మారతాయని అన్నారు. రైతుల ప్రయోజనాల కోసం అన్ని రాష్ట్రాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.




# మహాత్మా జ్యోతిరావు గురుకుల పాఠశాలలు ఇక...

(మొదటి పేజీ తరువాయి)

ఎంజేపీ బీసీ గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు మరణించిన సందర్భాల్లో వారి తల్లిదండ్రులకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయడానికి బోర్డు ఆమోదం తెలిపింది.ప్రిన్సిపాల్ (పాఠశాల) నియామకాలకు సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న 70 శాతం పదోన్నతులు, 30 శాతం ప్రత్యక్ష నియామకాల విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది.వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి కేవలం ఎంజేపీ గురుకుల విద్యాసంస్థల విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పించే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది.విద్యా పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పదవీ విరమణ చేసిన ప్రిన్సిపాళ్ల సేవలను అకడమిక్ కన్సల్టెంట్లుగా వినియోగించుకునే అంశంపై నియామక నిబంధనలను రూపొందించేందుకు కమిటీ ఏర్పాటు చేసి తదనుగుణంగా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.ఐఐటీలు, ఐఐఐటీలు, ఎన్ఐటీలు వంటి జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించాలని బోర్డు నిర్ణయించింది.ఇతర విద్యాసంస్థల సంఘాల తరహాలోనే సంస్థ పేరును తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ (TGWCWMJPREIS) గా మార్చాలని బోర్డు నిర్ణయించింది.ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలల్లో డెస్క్‌టాప్ కంప్యూటర్ల కొనుగోలు, జూనియర్ కళాశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (IFPs) సరఫరాకు ఆమోదం తెలిపింది.రాష్ట్రంలో 12 సైనిక్ స్కూళ్ల ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంలో ప్రస్తుతం ఉన్న ఆమోద స్థితిపై పూర్తి నివేదిక సమర్పిస్తే తదుపరి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు మాట్లాడుతూ, బీసీ విద్యార్థులకు అత్యుత్తమ విద్యా అవకాశాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాల పెంపు, పోటీ పరీక్షల్లో విజయాలు, జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో అధిక ప్రవేశాలు సాధించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయాలు సంస్థను మరింత బలోపేతం చేయనున్నాయని మంత్రి వెల్లడించారు.ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీమతి బాలమయాదేవి, ఎంజేపీ బీసీ గురుకులాల కార్యదర్శి శ్రీ సైదులు, వివిధ విభాగాల అధికారులు,బోర్డు సభ్యులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.





# మామ సినిమాకు అల్లుడి క్లాప్..

## NBK 112 ప్రారంభం



బాలకృష్ణ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'NBK 112'గా ప్రచారంలో ఉంది. నేడు అమరావతిలో ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. రాష్ట్ర మంత్రి, బాలకృష్ణ అల్లుడు నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరై క్లాప్ కొట్టారు. బాలయ్య చిన్న కుమార్తె తేజస్వీని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. క్లాప్ అనంతరం సినిమా డైలాగ్‌తో బాలకృష్ణ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేశ్, నిర్మాత సురేశ్ బాబుతోపాటు మరికొందరు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆగస్టులో ప్రారంభించి, 2027 వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది.

**ఏపీలో ఎన్నో అద్భుతమైన లోకేషన్స్: బాలకృష్ణ**

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మొదటి సినిమా పూజా కార్యక్రమం ఇదే. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. ''ప్రస్తుతం అమరావతి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. ఏపీలోని మిగతా ప్రాంతాల్లోనూ చలనచిత్ర పరిశ్రమను ముందుకు తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో ఈ సినిమా పూజా కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేశాం. అందరి సహకారంతోనే ఇండస్ట్రీ ముందుకు సాగుతోంది. ఏపీలో ఎన్నో అద్భుతమైన లోకేషన్స్ ఉన్నాయి. ఎన్టీఆర్, ఏఎన్నార్ పుట్టిన నేల ఇది. ఈ నేలపై మనం సినిమా రంగాన్ని అభివృద్ధి చేద్దాం. అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం'' అని వెల్లడించారు.

**ముద్దుల మామయ్య బాలయ్య: లోకేశ్**

''ఇప్పటి వరకూ నేను సినిమా చూసేందుకు, షూటింగ్‌లు చూసేందుకే వెళ్లాను తప్పా.. మూవీ ఓపెనింగ్‌కు ఎప్పుడూ వెళ్లలేదు. మొదటిసారి మా ముద్దుల మామయ్య సినిమాకు క్లాప్ కొట్టాను. బాలయ్య నేతృత్వంలో ఏపీలో సినీ ఇండస్ట్రీని బలోపేతం చేస్తాం. దానికి కావాల్సినవి అన్ని మౌలిక సదుపాయాలు అందిస్తాం. ఇది పవిత్ర భూమి... రాబోయే రోజుల్లో చాలా సినిమాలు ఇక్కడే ప్రారంభం కావాలని కోరుకుంటున్నా'' అని లోకేశ్ తెలిపారు.

# మోహన్‌లాల్‌తో భాగ్యశ్రీ?



'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యింది అందాల తార భాగ్యశ్రీ బోర్సే. తనదైన నటనతో కుర్రకారుని అలరించే ఈ భామ.. ఇప్పుడు మలయాళ చిత్రపరిశ్రమలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. అగ్రహీరో మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఎల్367' (వర్కింగ్ టైటిల్). విష్ణు మోహన్ తెరకెక్కిస్తున్నారు. ఈ మధ్యే ప్రకటించిన ఈ సినిమాలో నాయికగా భాగ్యశ్రీ బోర్సేని ఎంపిక చేసిందట చిత్రబృందం. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, వచ్చే నెల నుంచి షూటింగ్ ప్రారంభం కానుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.



# 'ఇడుపు కాయితం'.. హీరోయిన్ 15 రూల్స్ పెట్టింది: బన్నివాసు




భిన్నమైన కథలను ఎంచుకుంటూ అలరిస్తుంటారు నటుడు ప్రియదర్శి. ఆయన ప్రధాన పాత్రలో జానపద గాయని నాగదుర్గ హీరోయిన్‌గా రానున్న చిత్రం 'ఇడుపు కాయితం'. 'ఇడుపు కాయితం' అంటే తెలంగాణ వాడుక భాషలో 'విడాకుల పత్రం' అని అర్థం. నేడు ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ విడుదల చేశారు. వంశీ రెడ్డి దొండపాటి దర్శకత్వంలో రానున్న ఈ సినిమాను సుకుమార్ సమర్పణలో బన్నివాసు నిర్మిస్తున్నారు.

ఈ సందర్భంగా బన్నివాసు మాట్లాడుతూ.. కథ బాగుంటే దానికి సరిహద్దులు ఉండవని ఎన్నోసార్లు రుజువైందని అన్నారు. ''ఇది గ్లోబల్ స్థాయి కథ. ఈ తెలుగు సినిమాను బిహార్‌లో రిలీజ్ చేసినా అక్కడ కూడా ఆదరణ సొంతం చేసుకుంటుంది. ప్రతి ఇంట్లోనూ ఒక కామన్ ప్రాబ్లమ్ ఉంటుంది. పెళ్లి అయిన ప్రతి ఒక్కరికీ ఆ సమస్య తెలుసు. ఈ చిత్రానికి అందరూ కనెక్ట్ అవుతారు. ఏ కోడలైనా తన అత్తమామలను ఈ మూవీకి తీసుకుని వెళ్తే.. బయటకు వచ్చేటప్పుడు అత్తగారు కచ్చితంగా కోడలి చేతులు పట్టుకుని వస్తారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా చేయాలని నాగదుర్గను సంప్రదించగానే ఆమె నాకు 15 రూల్స్ పెట్టింది. అవి విని నేను చాలా ఆనందించా. ఒక తెలుగు అమ్మాయి ఏ విషయంలోనైనా ఎంత క్లారిటీగా ఉంటుందనేది అర్థమైంది'' అని బన్నివాసు తెలిపారు. సుకుమార్ రైటింగ్స్‌లో వచ్చే సినిమాలు ఎలా ఉంటాయో అందరికీ తెలుసని, ఈ చిత్రం కూడా ఒక మైలురాయిగా నిలుస్తుందని సుకుమార్ భార్య తబిత చెప్పారు.

# శ్రీలంక 'ఎ'పై సాయి సుదర్శన్ సెంచరీ



**టెస్టుల్లో నెం.3 స్థానం కోసం బలమైన పోటీ!**

భారత టెస్ట్ జట్టులో మూడో నంబర్ స్థానంపై కన్నేసిన తమిళనాడు యువ బ్యాటర్ సాయి సుదర్శన్ మరోసారి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. గాలే అంతర్జాతీయ స్టేడియం వేదికగా శ్రీలంక 'ఎ' జట్టుతో జరుగుతున్న అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో సాయి సుదర్శన్ (132 పరుగులు, 175 బంతుల్లో) నిలకడైన సెంచరీతో చెలరేగి విమర్శకులకు గట్టి సమాధానమిచ్చాడు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఇండియా 'ఎ' జట్టులో మిగిలిన బ్యాటర్లు విఫలమైనప్పటికీ, సుదర్శన్ మాత్రం ఒంటరి పోరాటం చేస్తూ 19 ఫోర్ల సాయంతో భారీ శతకాన్ని నమోదు చేశాడు. ఆయూష్ పాండే (25), దేవదత్ పడిక్కల్ (12), రుతురాజ్ గైక్వాడ్ (22) తక్కువ పరుగులకే అవుట్ కాగా, కెప్టెన్ ధ్రువ్ జురెల్ క్రీజులో ఉన్నాడు.

ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో సాయి సుదర్శన్‌కు ఇది 9వ సెంచరీ కావడం విశేషం. భారత సీనియర్ టెస్ట్ జట్టులో ఆడిన గత 7 మ్యాచ్‌ల్లో ఆశించిన స్థాయిలో రాణించలేదంటూ వస్తున్న విమర్శలకు ఈ ఇన్నింగ్స్‌తో సుదర్శన్ బ్రేక్ వేశాడు. ఇటీవలే ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన టెస్టులో 81 పరుగులతో రాణించిన అతను, ఇప్పుడు లంక గడ్డపై శతకంతో కదంతొక్కాడు. కేవలం 23 ఏళ్ల వయసున్న సుదర్శన్‌కు టీమ్ మేనేజ్‌మెంట్, కెప్టెన్ నుంచి పూర్తి మద్దతు లభిస్తోంది. మేనేజ్‌మెంట్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, భవిష్యత్తులో టీమిండియా టెస్ట్ జట్టులో కీలకమైన మూడో స్థానాన్ని సుస్థిరం చేసుకునే దిశగా సుదర్శన్ అడుగులు వేస్తున్నాడు.

# ఐర్లాండ్‌లో ప్రాక్టీస్ వసతులపై టీమిండియా అసంతృప్తి

**అందరి దృష్టి వైభవ్ సూర్యవంశీపైనే!**

ఐర్లాండ్‌తో జరగబోయే మొదటి టీ20 మ్యాచ్‌కు ముందు భారత క్రికెట్ జట్టుకు ఆరంభంలోనే చేదు అనుభవం ఎదురైంది. గురువారం ఇక్కడికి చేరుకున్న భారత ఆటగాళ్లకు అక్కడి స్థానిక క్రికెట్ బోర్డు నాసిరకం ప్రాక్టీస్ వసతులను కల్పించడంపై జట్టు మేనేజ్‌మెంట్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యంగా నెట్స్ బ్యాటింగ్ పిచ్ వెనుక 'సైట్ స్క్రీన్' లేకపోవడంతో బ్యాటర్లు బంతిని గుర్తించడానికి ఇబ్బంది పడ్డారు. ఈ విషయాన్ని టీమిండియా ఆపరేషన్స్ మేనేజర్ వెంటనే క్రికెట్ ఐర్లాండ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో, ప్రాక్టీస్ సెషన్ వేగం పుంజుకునేలోపే ఆ లోపాలను సరిదిద్దారు.



ఈ చిన్నపాటి అంతరాయం పక్కన పెడితే, అందరి దృష్టి టీమిండియా సరికొత్త యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపైనే నిలిచింది. సీనియర్ జాతీయ జట్టుతో కలిసి తన మొదటి నెట్ సెషన్‌లో పాల్గొన్న ఈ టీనేజ్ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్.. ఎంతో ఆత్మవిశ్వాసంతో తన ట్రేడ్‌మార్క్ షాట్లతో అలరించాడు. బెల్ఫాస్ట్ నగరంలో స్థిరపడిన భారతీయ సమాజం ఈ యువ ఆటగాడిని చూడటానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ ద్వారా వైభవ్‌కు 'గార్డియన్'గా నియమితులైన రోమీ భిందర్ కూడా వైభవ్ తల్లిదండ్రులతో కలిసి టీమ్ హోటల్‌లో కనిపించారు. అభిమానులు వైభవ్‌తో పాటు రోమీతోనూ సెల్ఫీలు దిగడానికి ఆసక్తి చూపించారు. కాగా, నూతన కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు ఈ సిరీస్‌ను విజయంతో ప్రారంభించాలని పట్టుదలగా ఉంది.



# మహిళల టీ20 ప్రపంచకప్ 2026

- బంగ్లాదేశ్‌పై 5 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం
- సెమీస్ రేసులో హర్మన్‌ప్రీత్ సేన!

మహిళల టీ20 ప్రపంచకప్‌లో భాగంగా జరిగిన అత్యంత కీలకమైన గ్రూప్ దశ పోరులో భారత మహిళల జట్టు బంగ్లాదేశ్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సెమీఫైనల్ రేసులో నిలవాలంటే ఖచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. పాకిస్తాన్, నెదర్లాండ్స్‌లపై ఘన విజయాలు సాధించి, సౌతాఫ్రికా చేతిలో ఓడిన భారత్‌కు.. సెమీస్ బెర్తును ఖరారు చేసుకోవడానికి ఈ గెలుపు ఎంతో కీలకంగా మారింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ బ్యాటర్లలో జువైరియా ఫెర్దౌస్ (33), కెప్టెన్ నిగార్ సుల్తానా (32) బాధ్యతాయుతంగా ఆడి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించారు. భారత బౌలర్లలో రాధా యాదవ్ 3 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేయగా, శ్రీ చరణి 2 వికెట్లతో ప్రత్యర్థిని కట్టడి చేశారు.

అనంతరం 137 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత మహిళల జట్టు కేవలం 16.5 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి 139 పరుగులు చేసి ఘన విజయాన్ని అందుకుంది. భారత ఓపెనర్ షెఫాలీ వర్మ ఆరంభం నుంచే బంగ్లాదేశ్ బౌలర్లపై విరుచుకుపడి కేవలం 34 బంతుల్లోనే 53 పరుగులతో మెరుపు హాఫ్ సెంచరీ సాధించి జట్టు విజయానికి బలమైన పునాది వేసింది. ఈ అద్భుత ఇన్నింగ్స్‌కు గాను షెఫాలీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును అందుకుంది. మిడిలార్డర్‌లో ఇతర బ్యాటర్లు సహకారం అందించడంతో భారత్ సులువుగా లక్ష్యాన్ని ఛేదించి, సెమీఫైనల్ రేసులో ముందంజ వేసింది.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com